# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం । 25 డిసెంబర్ 2025 । ■ 16 పేజీలు




## విధుల్లో క్రమ శిక్షణ పాటించాలి

■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ■ జైనథ్, తలమడుగు పోలీస్ స్టేషన్‌ల తనిఖీ

# అధికార దర్జా.. కన్నుపడితే కబ్జా!

■ ప్రభుత్వ భూములకు ఎసరు పెడుతున్న ప్రజాప్రతినిధి
■ బెల్లంపల్లి నియోజకవర్గంలో యథేచ్ఛగా భూ కజ్జాలు
■ అధికార పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి శాసించే స్థాయికి..
■ బెల్లంపల్లి డివిజన్‌లో అధికార పార్టీ నాయకుడి ఆగడాలు
■ ఇప్పటికే విలువైన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం
■ కోట్లాది విలువైన భూమి కాజేతకు ఆ నాయకుడి కుట్ర
■ నకిలీ పత్రాలతో యథేచ్ఛగా సాగిస్తున్న భూదందాలు
■ ఫెన్సింగ్ వేసిన భూములు గుట్టుచప్పుడు కాకుండా స్వాహా
■ బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములకు కరువైన రక్షణ
■ రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోని వైనం




13

ప్రభాత సమాచారం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోఅధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి భూదాహానికి అడ్డుఅదుపూ లేకుండాపోతోంది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జాకు పాల్పడుతున్నారు. కొండలు, గుట్టలు, పోరంబోకు భూములు ఇలా... దేన్నీ వదలకుండా అమాంతం ఊడ్చేస్తున్నారు. ప్రభుత్వ భూములపైనా రాబందుల్లా వాలిపోతున్నారు. ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను తమ సొంత ఆస్తుల్లా పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో పట్టణంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆయన ప్రభుత్వ భూములపై కన్నేశారు. సంబంధిత అధికారుల ఉదాసీనత, రికార్డులోని లోపాలను ఆసరాగా చేసుకుని భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. వీరికి రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో ఈ వ్యవహారం సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూములను పట్టపగలే చదును చేయడం, దొంగ దస్తావేజులు సృష్టిస్తూ రాత్రికి రాత్రే వాటిలో నిర్మాణాలు చేపట్టడం ఇక్కడ సర్వసాధారణమైంది. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుడు భూ కజ్జాలకు పాల్పడుతున్నా.. బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.





## లోక రక్షకుడి రాక కోసం..

■ నేడు క్రిస్మస్ పర్వదినం ■ దేదీప్యమానంగా చర్చిలు
■ బుధవారం అర్ధరాత్రి నుంచి వేడుకలు ప్రారంభం
■ తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు.. బోధనలు
■ క్రీస్తు జనన సందేశాన్ని ఇవ్వనున్న దైవజనులు
■ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. రంగులు వేసి.. విద్యుద్దీపాలను అమర్చి శోభాయమానంగా ముస్తాబు చేశారు. యేసు క్రీస్తు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను నిర్వహిస్తారు. క్రిస్మస్ పండుగను క్రైస్తవ సంఘాలతో పాటు క్రైస్తవేతరులు కూడా వేడుకలు నిర్వహించనున్నారు. పలు చర్చిలలో బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. పండుగ రోజు గురువారం ఉదయం 9:30గంటలకు చర్చిలలో క్రిస్మస్ ఆరాధనలలో క్రైస్తవులు పాల్గొంటారు.

## నీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

■ కడెం ప్రాజెక్టు కాలువల మరమ్మతులపై దృష్టి
■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
■ అధికారులతో పలు సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష



## ప్రమాణస్వీకార వేళ వాంకిడి పంచాయతీలో రచ్చ

■ వాంకిడి సర్పంచ్‌గా సతీష్ ప్రమాణ స్వీకారం
■ పాలకవర్గం తొలి సమావేశంలోనే రచ్చ
■ అధికారులు అవమానించారంటూ ఆందోళన..





## పల్లెలపై వరాల జల్లు..

■ సర్పంచ్‌లకు సీఎం న్యూ ఇయర్ గిఫ్ట్
■ మేజర్ పంచాయతీలకు రూ.10లక్షలు
■ మైనర్ జీపీలకు రూ.5లక్షలు
■ ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధం లేకుండా నిధులు
■ గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి ■ పార్టీలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాలి ■ సీఎం రేవంత్ రెడ్డి



11

పల్లెలపై సీఎం రేవంత్ రెడ్డి వరాలజల్లు కురిపించారు. గ్రామ పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామ పంచాయతీలకు రూ.5లక్షలు, పెద్ద పంచాయతీలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సంబంధం లేకుండా ప్రత్యేక నిధులు వస్తాయని, వీటిని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు గ్రామాల్లో సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు వచ్చే నిధులకు ఈ నిధులు అదనమన్నారు. నూతన సంవత్సరంలో ఈ ప్రత్యేక నిధులను అందజేస్తామన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని, ఇతర పార్టీ నుంచి గెలిచారనే వివక్ష ఉండొద్దన్నారు. విభేదాలను పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధిపై ఫోకస్ చేయాలని సూచించారు.



## మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమం ద్వారా

# క్లెయిమ్ చేయని సొమ్మును తిరిగి పొందవచ్చు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
"మీ డబ్బు - మీ హక్కు" కార్యక్రమం ద్వారా బ్యాంకులు, బీమా సంస్థలు, పోస్ట్ ఆఫీసులలో ఖాతాలు కలిగి క్లెయిమ్ చేయని సొమ్మును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం చేతన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం అపర్ణ రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ప్రశాంత్, ఎ డి సి సి ఏజీఎం రవి కిషోర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ కిరణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి లతో కలిసి ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తులను సమర్థవంతంగా, త్వరగా పరిష్కరించేందుకు నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు దాటి ఖాతాలలో నిలువ ఉండి వినియోగించని నగదు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెందిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఫండ్ లో జమ చేయడం జరుగుతుందని, ఇట్టి క్లెయిమ్ చేయని నగదుకు సంబంధించి ఎవరైనా సంబంధిత బ్యాంకులో కె.వై.సి. డాక్యుమెంట్, ఇతర సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించడం ద్వారా నగదును తిరిగి పొందవచ్చని తెలిపారు. అన్ క్లెయిమ్ నగదు సంబంధిత వివరాలను బ్యాంకుకు వెళ్లి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన ఉద్గం పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. ఈ విషయమై గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఆర్థిక అక్షరాస్యత ద్వారా వయోజనులకు అవగాహన కల్పించి విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జరుగుతుందని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లలో అవాంఛిత లింకుల ద్వారా సైబర్ మోసానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఓ.టి.పి. ఎవరికీ చెప్పవద్దని, అత్యాశ, అమాయకత్వం ద్వారానే డబ్బులు నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 475 ఖాతాలకు సంబంధించి 2 కోట్ల 88 లక్షల రూపాయల క్లెయిమ్ సొమ్మును సెటిల్ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లాలోని కొన్ని అన్ క్లెయిమ్ ఖాతాల నుంచి సెటిల్ అయిన ఖాతాలకు సంబంధించిన చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కుష్టు రహిత సమాజమే ధ్యేయం

### డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ రావ్

**బోథ్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
కుష్టు రహిత సమాజమే ధ్యేయమని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ రావ్ తెలిపారు. బుధవారం మండలంలోని బోథ్, పొచ్చెర గ్రామాలతో పాటు సోనాల మండల కేంద్రంలో ఆశాకార్యకర్తలు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి వామన్ రావు మాట్లాడుతూ కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించాలనే ధ్యేయంతో ఆశా కార్యకర్తలతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ రావు అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. శరీరంపై పాలిపోయిన, రాగి రంగు గల మొద్దు బారిన మచ్చలు, కాళ్ళు, చేతుల్లో తిమ్మిర్లు ఎవరికైనా ఉన్నట్లయితే తమ ఇంటికి వచ్చే ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి చూపించుకోవాలని కోరారు. ఎండీటీతో కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని, అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి అంగవైకల్యం కలగదని పేర్కొన్నారు. 2027 సంవత్సరం వరకు భారతదేశాన్ని కుష్టు రహిత భారతదేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఆశా కార్యకర్తలు సైతం సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో కుష్టు వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ రమేష్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి



### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ విద్యా సంస్థలలో అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషక విలువలు కలిగిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు చేసిన అల్లికలు, కళాకృతులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఏకాగ్రతతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సంపూర్ణంగా బంద్ పాటించిన వ్యాపారులు



### పంట కొనుగోళ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరికి నిరసన

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరికి నిరసనగా అఖిల పక్షల ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ ఆఫీస్ ముందు నిరసన చేపట్టి సంపూర్ణ బందు పాటించారు. ముందుగా స్థానిక తహసీల్దార్ శ్యాంసుందర్‌కు పంట కొనుగోళ్లు ప్రారంభించాలని, ఎటువంటి నిబంధనలు లేకుండా యూరియాలు రైతులకు అందించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఒక్క నెల నుండి ఇచ్చోడ మార్కెట్లో రంగు మారిన సోయా, రంగు మారిన మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరితో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి కారణం యూరియా ఎప్పటిలాగే యూరియా పంపిణీ చేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం కొత్తగా ఆప్ తీసుకురావడం దానివల్ల నిరక్షరాస్యులైన రైతులకు అలాగే ఆదివాసి గిరిజన రైతులకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కావున దానిని వెంటనే రద్దుచేసి యధావిధిగా యూరియా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గత పది సంవత్సరాల కాలంలో ఏనాడు కూడా రైతులు సొసైటీల ముందు గానీ ఫర్టిలైజర్ల ముందు గాని ఏనాడు కూడా లైన్లో నిలుచుని ఎరువులు, విత్తనాలు కానీ ఏరోజైనా ఇబ్బంది ఉండేనా కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులకు కష్టాలు మొదలయ్యాయని, కావున ఇప్పటికైనా మొండివైఖరి వీడనాడి రైతులకు సకాలంలో ఎరువులు అలాగే రంగు మారిన పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పరచ సాయన్న, బీఆర్ఎస్ పార్టీ యువజన మండల అధ్యక్షులు దుబ్బుల చంద్ర శేఖర్, రైతులు చట్ల వినీల్, కొంగర్ల రాజన్న, చట్ల తరుణ్, కర్వల గంగయ్యా తదితరులు పాల్గొన్నారు.

## కొట్టానికి నిప్పు పెట్టిన

# గుర్తు తెలియని వ్యక్తులు

**జన్నారం, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రోటిగూడ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఓ వడ్రంగి కొట్టానికి నిప్పంటించారు. ఈ ఘటనలో బాధితుడు పాలాజీ సుధాకర్‌కు చెందిన విలువైన పనిముట్లు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఉపాధి కోల్పోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. కొట్టంలో ఉన్న తన వడ్రంగి విలువైన సామాన్లతో సహా పూర్తిగా కాలిపోయాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



# మేము ప్రజాప్రతినిధులం కామా..?

- వాంకిడి సర్పంచ్‌గా సతీష్ ప్రమాణ స్వీకారం
- పాలకవర్గం తొలి సమావేశంలోనే రచ్చ
- కుర్చీలు వేయకుండా అవమానించారంటూ మహిళా వార్డు సభ్యుల ఆవేదన



**వాంకిడి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
వాంకిడి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా సిహెచ్. సతీష్ బుధవారం రాజ్యాంగబద్ధంగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రత్యేక అధికారి శ్రావణ్ కుమార్ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సిహెచ్ సతీష్ తో పాటు ఏడుగురు వార్డు సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామంలోని ఆయా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అలాగే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ పంచాయతీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో పాటుపడతానన్నారు. ఇదిలా ఉండగా పాలకవర్గం మొదటి సమావేశంలో ఉద్రిక్తత నెలకొంది. కూర్చోవడానికి కుర్చీలు ఇవ్వకుండా అధికారులు తమను అవమానించారంటూ మహిళా వార్డు సభ్యులు గ్రామ కార్యదర్శి శివ్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాణస్వీకారానికి ముందు స్టేజ్‌పై 15 కుర్చీలు వేశారు అధికారులు.. సర్పంచ్ ప్రమాణస్వీ కారానికి రాగానే తాము కూర్చోవాల్సిన 7 కుర్చీలను అధికారులు తీసేశారని వార్డు సభ్యులు మండిపడ్డారు. మేము వార్డు సభ్యులం కాదా అంటూ నిలదీశారు. స్థానికులు కొందరు కల్పించుకోవడంతో తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. కాసేపు సమావేశంలో ఉద్రిక్తత నెలకొంది. 22న ముహూర్తం బాగులేక ప్రమాణస్వీకారానికి దూరంగా ఉన్న సర్పంచ్.. ఏడుగురు వార్డు సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలో



ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక10 వార్డు సభ్యురాలు ప్రమాణస్వీకారానికి స్టేజీపైకి రాగా సర్పంచ్ బీఆర్ఎస్ మద్దతు దారులు ఆమెను ఉప సర్పంచ్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఉప సర్పంచ్ ఉండగానే ఆమె ఉప సర్పంచ్ అంటూ నినాదాలు చేశారు. ఆదిలోనే వర్గ విభేదాలు దర్శనమివ్వడంతో ముందు ఎలా ఉంటుందోనని స్థానిక జనాల్లో ఉత్పన్నమవుతున్నాయి.

# ఏఐటీయుసీ వైఫల్యంతోనే సింగరేణి వేడుకల కుదింపు




## టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

**బెల్లంపల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
దేశంలోనే ఘన చరిత్ర కలిగిన సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తగ్గించి నిర్వహించడానికి సింగరేణిలో గుర్తింపు సంఘం వైఫల్యమేనని టీబీజీకేఎస్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకే తలమానికమైన సింగరేణిలో సింగరేణి వేడుకలను తగ్గించి నిర్వహించడం సింగరేణి కార్మికులను అవమానించడమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా సింగరేణి యాజమాన్యం నడుచుకుంటూ కోట్ల రూపాయలు వివిధ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ఖర్చు పెడుతున్నా.. ఉలుకు పలుకు లేని గుర్తింపు సంఘం, సింగరేణి వేడుకలకు కూడా డబ్బులు తగ్గించి ఇవ్వడాన్ని ఆపలేకపోయిందన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పూర్తిగా అన్ని విషయాలలో వైఫల్యం చెందిందని, ఈ మధ్యకాలంలో వచ్చిన సర్కులర్లను ఆపలేకపోయిందని ధ్వజమెత్తారు. కార్మికులకు అన్యాయం జరుగుతున్న ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు. సింగరేణి వేడుకలను తగ్గించడానికి ఆపే శక్తి లేక గనుల మీద అడ్డుకున్నట్టు షో చేయడాన్ని ఎద్దేవా చేశారు. ఈ మధ్యకాలంలో రిటైర్ అయిన కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్ చెల్లింపులు కూడా క్వార్టర్ ఖాళీ చేయాలని నిబంధన పెట్టడాన్ని ఆయన ఖండించారు. కొడుకుకు ఉద్యోగం ఇచ్చిన తర్వాత అతని పేరు మీద క్వార్టర్ చేయించుకునే అవకాశం ఉన్నదని ఒకపక్క ఉద్యోగాలు ఇవ్వకుండానే క్వార్టర్ ఖాళీ చేయలేదనే పేరు మీద రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్ ఆపడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఇది కూడా ఏఐటీయూసీ వైఫల్యమే అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సర్క్యులర్‌ను సరిచేయించి రిటైర్డ్ కార్మికులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్ కుమార్, బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు, మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సంపత్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్, సెంట్రల్ కమిటీ నాయకులు రాజనాల రమేష్, అశోక్, రమేష్, మైదం వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



# లక్షెట్టిపేటలో పోలీసుల నాకాబంది

**లక్షెట్టిపేట, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా వద్ద బుధవారం లక్షెట్టిపేట పోలీసులు నాకాబందీ నిర్వహించారు. లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ సిబ్బందితో కలిసి వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జంగకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరు కూడా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తు చర్యలో భాగంగా తనిఖీలు చేపట్టామన్నారు. వాహనదారులు రవాణా నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు వాహనాల వెంట ఉంచుకోవాలని, వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మత్తు పదార్థాలైన గంజాయి లాంటి వాటికి బానిస కాకూడదని, అలాంటివి రవాణా చేసినా, తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీలు చేస్తూ వాహనాలు ఎవరివి ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాయని వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రవెల్లి నుండి బెల్లంపల్లి వెళ్లే

# రహదారి శుభ్రం చేసిన నేతలు

**బెల్లంపల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
గత ఎన్నో రోజులుగా చంద్రవెల్లి నుండి బెల్లంపల్లికి వెళ్లే రహదారి పిచ్చి మొక్కలు, రేపుగా పెరిగిన చెట్లతో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుకోవడంతో, నూతనంగా చంద్రవెల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం బాధ్యతలు తీసుకున్న వెంటనే బుధవారం సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గజేల్లి రాజకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆ రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలను క్లీనింగ్ చేయడం, రేపుగా పెరిగిన మొక్కలను నరికించడంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోయాయి. నూతనంగా గెలుపొందిన పాలకవర్గం ఇలాంటి పనులు వెంటనే చేపట్టడంపై ప్రజలు, వాహనదారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు

# దరఖాస్తులు ఆహ్వానం

**ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**



జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి జూలూరు యాదగిరి తెలిపారు. ఈ మేరకు 11-12-2025 నుండి 21-01-2026 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు రుసుముగా రూ.100 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక్క ఫోన్ నంబర్‌తో ఒక్క దరఖాస్తు మాత్రమే చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష 22-02-2026 న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లాలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఇతర సమాచారం కోసం https://tgswreis.telangana.gov.in, https://tgcet.cgg.gov.in వెబ్‌సైట్లను సందర్శించాలని ఆయన సూచించారు.

# సర్పంచులు గ్రామాభివృద్ధికి బాటలు వేయాలి



## ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వలాయత్ అలీ

**దండేపల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
నూతన పాలకవర్గంతో కలిసి సర్పంచులు కష్టపడి పనిచేసి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని జిల్లా ట్రైనీ అసిస్టెంట్ డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ విలాయత్ ఆలీ అన్నారు. బుధవారం దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శ్రీలక్ష్మి మండల సమైఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల మహిళ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను డీఆర్డీవో కిషన్ తో కలిసి చిరు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజల దరికి చేరే విధంగా పాటుపడాలన్నారు. ప్రభుత్వం మహిళలు అన్నిరంగాల్లో రాణించే విధంగా అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలన్నారు. అనంతరం మండలంలో మహిళ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సత్కరించారు. ర్యక్రమంలో డీపీఎం సారయ్య, నాగరాణి, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అనిత, ఏపీఎం లక్ష్మి, ఎంపీవో విజయ ప్రసాద్, సీసీలు లావణ్య పాల్గొన్నారు.




# విధుల్లో క్రమశిక్షణ, సమయ పాలన పాటించాలి

**- అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలి - గ్రామాలను సందర్శిస్తూ వీపీఓ విధానాన్ని అమలు చేయాలి - జైనథ్ పోలీస్ స్టేషన్ పరిశీలన - ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**జైనథ్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పూర్తి అప్రమత్తతో విధుల నిర్వహణ చేపట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సందర్శించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, ఎస్సై గౌతమ్ సారథ్యంలో ఉన్న పోలీసు సిబ్బంది ద్వారా నిర్వహించిన కవాతును ఎస్పీ పరిశీలించారు. ప్రతి శనివారం పరేడ్ నిర్వహణ చేపట్టాలని, పరేడ్ వల్ల శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం లభిస్తాయి అని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న పచ్చదనంపై ప్రశంసించారు. ప్రతి శనివారం పరేడ్ నిర్వహణ చేపట్టాలని, పరేడ్ వల్ల శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం లభిస్తాయి అని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న పచ్చదనంపై ప్రశంసించారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి కేసుల స్థితిగతులపై పూర్తి వివరణ అడిగి తెలుసుకున్నారు. తదుపరి సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిరోజు వాహన తనిఖీలు చేపడుతూ ప్రమాదాలను నివారించాలని ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తూ, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా పర్యవేక్షించాలన్నారు. డయల్ 100 ద్వారా పాయింట్ బుక్స్ తనిఖీ చేస్తూ సస్పెక్ట్లను రౌడీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. రాత్రి సమయాలలో ఫింగర్ ప్రింట్ పరికరంతో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ప్రజలకు పోలీసు అక్క, షీ టీం, సైబర్ క్రైమ్, డయల్ 100 యొక్క ప్రాముఖ్యతలపై వివరించాలన్నారు. పోలీస్ స్టేషన్ ను పరిశీలించి రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలన్నారు. పోలీసు విధులలో ప్రతి ఒక్కరికి నీతి,నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలి అని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న రిసెప్షన్, సెక్షన్ ఇంచార్జ్, డయల్ హండ్రెడ్, బ్లూ కోర్ట్, 5ఎస్, ఎస్ హెచ్ ఓ, ఇన్వెస్టిగేషన్ ఇలాంటి వర్టికల్స్ అమలు చేయాలన్నారు. మండలాలలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా పటిష్టమైన గస్తీ నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలకు పూర్తిగా జిల్లా నుండి రూపుమాపే దిశగా గంజాయి, గుడుంబా లాంటి వాటిని జిల్లా నుండి కనుమరుగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎల్ జీవన్, జైనథ్ సిఐ జి శ్రావణ్ కుమార్, ఎస్సై పి గౌతమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కుమ్మరుల మేధో మదన సదస్సును
# విజయవంతం చేయండి

**జన్నారం, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
ఈనెల 28న హైదరాబాదులో నిర్వహించే కుమ్మరుల మేధో మదన సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షులు కోడూరు చంద్రయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. చాలా ఏండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని కుమ్మరులలో కదలిక ఏర్పరచడానికి చైతన్య పరచడానికి ఒక మంచి కార్యక్రమాన్ని అఖిల భారతీయ కుమ్మర ప్రజాపతి కుంభాకార్ మహా సంఘ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు చేస్తున్నారని ఈ సందర్భంగా సంఘ కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం విస్తృతంగా ప్రచారం జరగవలసి ఉందని, ప్రతి జిల్లాలో కుమ్మర కులస్తులు వార్డు మెంబర్లుగా సర్పంచులుగా ఉప సర్పంచ్‌లుగా అనేకమంది గెలిచినారన్నారు. ఈ మేధో మదన సదస్సు హైదరాబాద్‌లోని బోడుప్పల్ "రాఘవ బంకెట్ హాల్లో" జరగనుందన్నారు. ఈ సదస్సుకు కుమారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు



**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల పట్టణం లక్ష్మీనగర్ శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం ఘనంగా ప్రీ-క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అయూబ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అందరికి సంప్రదాయం, క్రిస్మస్ పండుగ గురించి అవగాహన కల్పించేందుకే ఈ వేడుకలను నిర్వహించామన్నారు. పిల్లలు శాంటా, దేవదూతల వేషాధారణతో అలరించారు. పాఠశాల ఆవరణ అంతా పండుగ వాతావరణం అలుముకుంది. జింగిల్ బెల్ పాటకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఏజీఎం అరవింద్‌రెడ్డి, కోఆర్డినేటర్లు జయశ్రీ, రోజారాణి, ఇంచార్జిలు అనగమత, పిఇటి కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీఎస్‌హెచ్‌ఎంల నూతన కార్యవర్గం



**నిర్మల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి సంఘ సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు గౌరవ అధ్యక్షులుగా దస్తురాబాద్‌కు చెందిన కోట వేణు జిల్లా అధ్యక్షులుగా ఖానాపూర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా, ముధోల్ చెందిన ఎస్ దేవేందర్ రెడ్డి ఉపాధ్యక్షులుగా లక్ష్మణ కు చెందిన ఎం భూమన్న మహిళా ఉపాధ్యక్షులుగా సోనుకు చెందిన పి.త్రివేణి కార్యదర్శులుగా సారంగపూర్ కు చెందిన జి భూమేష్ మహిళా కార్యదర్శిగా నిర్మల్ రూలర్‌కు చెందిన జలజ కోశాధికారిగా పెంబికి చెందిన జై లింగన్న మీడియా ఇన్చార్జిగా సోను కు చెందిన రమేష్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ల పాటు పనిచేస్తుందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో సన్మానం అభినందనలు తెలిపారు.



## 'తెలంగాణ ఉద్యమకారుల'
# పుస్తకం ఆవిష్కరణ

**ముధోల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
బైంసా పట్టణం చెందిన తెలంగాణ రచయితల ఫోరం జిల్లా అధ్యక్షులు పుండలిక్ రావు రచించిన తెలంగాణ ఉద్యమకారుల పుస్తకాన్ని బుధవారం డిసిసి మాజీ అధ్యక్షులు శ్రీహరి రావు ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల చరిత్రను ఈ పుస్తకంలో వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ గౌడ్ స్థానిక నాయకులున్నారు.

# సోయాబీన్, మక్క కొనండి

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
సోయాబీన్ పంటను కొనుగోలు చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడంపై రైతులు ఆందోళన చేపట్టారు. వానాకాలం సీజన్‌లో పండించిన సోయా, మక్క పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. మండల కేంద్రంలో బంద్ పాటించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మూసివేస్తే తాము పంటను ఎలా అమ్ముకోవాలని రైతులు ప్రశ్నించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరితో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి కారణం యూరియా ఎప్పటిలాగే యూరియా పంపిణీ చేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం కొత్తగా ఆప్ తీసుకురావడం దాని వల్ల నిరక్షరాస్యులైన రైతులకు అలాగే ఆదివాసి గిరిజన రైతులకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కావున దానిని వెంటనే రద్దుచేసి యథావిధిగా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారు లు తక్కువ ధరకే అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం వియోగించుకోవాలి




**తలమడుగు, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
ప్రజా రక్షణలో 24 గంటలు కృషి చేస్తున్న బలమైన శక్తిగా ఉండే పోలీసు వ్యవస్థ సిబ్బందికి క్రమశిక్షణ సమయపాలనతో పాటుగా, నీతి నిజాయితీలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీసు సిబ్బంది వ్యవస్థ కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా తలమడుగు పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని పరిశీలించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, రూరల్ ఎస్ఐ రాధిక పూల మొక్క అందజేసి ఆహ్వానించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిశుభ్రతపై దృష్టి సారించాలని, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో చెట్లను నాటుతూ పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి స్థితిగతులను కేసు పరిస్థితిలను తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది కి కేటాయించిన వస్తువులను వారి సర్వీస్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ 24 గంటలు పని చేసే వ్యవస్థలలో పోలీసు వ్యవస్థ కీలకమైనదని ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ బాధ్యతలను పోలీసు వ్యవస్థ చేపడుతుందని, దానిని సక్రమంగా నిర్వర్తించినప్పుడు పోలీసు కీర్తి ప్రతిష్టలు సమాజంలో ఉన్నత స్థాయికి చేరుతాయని తెలిపారు. మండల పరిధిలో ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని, గ్రామాలను సందర్శిస్తూ వారికి సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ క్లబ్, పోలీసు అక్క, మహిళల భద్రత, షీ టీం, ముఖ్యంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించాలని తెలిపారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ పూర్తి సమాచార సేకరణ చేపట్టి ప్రజలలో మమేకం కావాలని తెలిపారు.



### పాత్రికేయుల న్యాయమైన

## డిమాండ్లు పరిష్కరించాలి

**నిర్మల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్టు పెన్షన్ సంఘం జాతీయ కార్యదర్శి జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న అన్నారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట పెన్షనర్లు చేపట్టిన ధర్నాకు హాజరై సంఘీభావం తెలిపారు అంతకుముందు పిఆర్టియు జిల్లా అధ్యక్షులు నరేంద్రబాబు టి యు టి ఎఫ్ఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీ మనోహర్ రెడ్డి జిల్లా నాయకులు రవి కిరణ్ ముత్యం ముత్తన్న తదితరులు సంఘీభావం తెలిపారు పిఆర్టియు అర్బన్ అధ్యక్షులు గజ్జరం పాత్రికేయులకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

## బెల్లంపల్లి పట్టణంలో నాకాబంది

**బెల్లంపల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

పట్టణంలో వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నాకాబంది నిర్వహించి 7 వీల ర్స్ వాహనాలను, బుధవారం రోజున సరైన పత్రాలు నంబర్ ప్లేట్లు లేని 9 టూ వీలర్స్ ను, ఆటోను స్వాధీన పరుచుకున్నట్లు వన్ టౌన్ సిఐశ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉన్నతాధికార సూచన మేరకు ఈనెల 31 వరకు పోలీస్ నాకాబంది నిర్వహించడం జరుగుతుందని, ప్రజలందరూ వాహనానికి సంబంధించిన పత్రాలతో ప్రయాణిస్తూ పోలీస్ వారికి సహకరించాలని, సరైన నంబర్ ప్లేట్ లేని వాహనాలతో తిరగరాదని, మద్యం సేవించి వాహనం నడిపితే 10వేల జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలు దృష్టిలో ఉంచుకొని రోడ్డు ప్రమాదాలు జరగకుండా సహకరించాలని కోరారు.

### యాత్ర ఆనందం సర్వీసులను

## సద్వినియోగించుకోవాలి



**నిర్మల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

భక్తుల సౌకర్యం కోసం టీజీ ఆర్టీసీ ఆధ్వర్యంలో వివిధ పుణ్యక్షేత్రాలకు యాత్రానందం సర్వీసులను నడుపుతున్నట్టు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. బుధవారం నిర్మల్ డిపో ద్వారా మహారాష్ట్ర తుల్జాపూర్ పండరిపూర్ కు బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. భక్తులు కోరిన వెంటనే ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సదివించుకోవాలని కోరారు. ఆర్టీసీ అధికారులు రమణ ఏఆర్ రెడ్డి పాల్గొన్నారు.

### ఫోన్ వాడినందుకు భయపడి

## విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**జైనథ్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

ఫోన్ వాడినందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు చెబుతారనే భయంతో జైనథ్ కేజీబీవీలో చదువుతున్న ఓ విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. మంగళవారం పాఠశాల నుంచి పారిపోయిన ఆమెను పెన్‌గంగా కెనాల్ వద్ద అపస్మారక స్థితిలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# చలిలో వణుకుతున్న కార్మికులు

### సింగరేణి కార్మికులకు ఉన్ని దుస్తువులు ఇవ్వని సింగరేణి యాజమాన్యం



**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల తర్వాత సూర్యుడు కనిపిస్తుండగా, సాయంత్రం ఐదు గంటలకే చీకటి పడుతుంది. జిల్లా గరిష్ట(పగటి) ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలు నమోదవుతుండగా కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలు 9.5 డిగ్రీల సెల్సియస్ కు పడిపోయాయి. శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల పరిధిలో భూగ ర్భ, ఓపెన్ కాస్టు బొగ్గు గనులుండగా కార్మికులు ప్రతి రోజు మూడు (ఉదయం, మధ్యాహ్నం, రాత్రి) షిఫ్టులలో విధులు నిర్వహిస్తుంటారు. ఉదయం విధులకు హాజరయ్యే కార్మి కులు, మధ్యాహ్నం విధులు నిర్వహించి ఇంటి కి వచ్చే కార్మికులు చలితో ఇబ్బంది పడుతుండగా రాత్రి విధులు నిర్వహించే కార్మికులు విధులకు వెళ్లే సమయంలో, ఇంటికి వచ్చే సమయాల్లో చలికి ఇబ్బంది పడుతున్నారు.

**గరం కోట్లు ఇవ్వని సింగరేణి...**

ప్రతి ఏడాది సింగరేణి కార్మికులకు ఇచ్చే గరం కోట్లు చలి మొదలైనప్పటికీ యాజమాన్యం ఇంత వరకు అందించడం లేదు. దీనితో సర్ఫేస్‌లో పని చేసే ట్రామర్, హాలర్ ఆపరేటర్, మ్యాన్వే, ల్యాంప్ రూమ్, బిట్ షార్పనర్, మొదలగు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి కాలంలో గరం కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంత వరకు అందజేయకపోవడంతో కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. చలి తీవ్రత మరింత పెరిగితే గైర్హాజరు శాతం పెరిగే అవకాశం లేకపోలేదు. సెక్యూరిటీ సిబ్బందికి వర్షా కాలంలో ఇవ్వాల్సిన వాన కోట్లను సింగరేణి యాజమాన్యం సరైన సమయంలో ఇవ్వకుండా వర్షా కాలం ముగిసిన తర్వాత ఇచ్చిందని, గరీం కోట్లు అయినా సమయానికి అందించాలని కార్మికులు కోరుతున్నారు.

**సరైన సమయంలో అందజేయాలి..**

చలి మొదలైనా సింగరేణి యాజమాన్యం ఇప్పటి వరకు కార్మికులకు గరీం కోట్లు ఇవ్వకపోవడం బాధాకరం. ప్రాతినిధ్య సంఘాలు నోరుమెదపక పోవడం కార్మికులపైన వారి ప్రేమకు నిదర్శనం. గనులపైన కార్మికుల సెల్ ఫోన్లు, వస్తువులు, హెల్మెట్ లు భద్రపరుచుకోవడానికి లాకర్లను ఏర్పాట్లు చేయాలి. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల సంక్షే మం పైన దృష్టి పెట్టాలి. గనులు పుట్టిన సమయంలో కార్మికుల రూములకు వేసిన వైట్ వాష్ వేశారు. సింగరేణి లెవల్ లో సేఫ్టీ వీక్ నడుస్తున్న సందర్భంగా ఈసారైనా అన్ని రూములకు వైట్ వాష్ వేసి క్లీనింగ్ చేపించాలి.

## కుభీర్ మండల సర్పంచుల సంఘం కార్యవర్గం







**కుభీర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కుభీర్ మండల సర్పంచుల సంఘం కార్యవర్గాన్ని ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుభీర్‌లోని తపస్వి డిగ్రీ కళాశాలలో జరిగిన సర్పంచుల సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా డీఎన్టీ గ్రామ సర్పంచ్ జాదవ్ సునీత, అధ్యక్షుడిగా ధార్ కుభీర్ గ్రామ సర్పంచ్ తోకల మారుతి, ఉపాధ్యక్షులుగా నిగ్వా గ్రామ సర్పంచ్, (బీఆర్ఎస్) మండల నాయకుడు మెంచు రమేష్, ప్రధాన కార్యదర్శిగా సిర్పెల్లి (హెచ్) సర్పంచ్ ఆరెపల్లి సతీష్, సహాయ కార్యదర్శిగా బెల్గాం గ్రామ సర్పంచ్ నిస్తుర్ గోవర్ధన్, కోశాధికారిగా గోడపూర్ సర్పంచ్ మోరే పల్లవి, సోషల్ మీడియా కన్వీనర్ గా సాంవ్లీ సర్పంచ్ గాడేకర్ లక్ష్మణ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీడీఓ సాగర్ రెడ్డిని కలిసి కార్యవర్గ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తోకల మారుతి మాట్లాడుతూ.. సర్పంచుల సమస్యలపై అందుబాటులో ఉండి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు, అధికారులు కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

## హిందూ కమ్యూనిటీ షెడ్‌కు భూమి పూజ



**జైనూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో బుధవారం జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అత్రం భీంరావ్ తదితరులు హిందూ కమ్యూనిటీషెడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ మాట్లాడుతూ హిందూ కమిటీ షెడ్ నిర్మాణం కోసం త్వరలో నిధులు మంజూరు అయ్యేలా ఖనాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. త్వరలో నిధులు మంజురు చేసి షెడ్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. నూతన సర్పంచ్ కొడప ప్రకాష్ మాట్లాడుతూ జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తామన్నారు. అదే విధంగా పంచాయతీ వాసుల పరస్పర సహకారంతో అభివృద్ధికి ఎక్కువ నిధులు వచ్చేలా చూస్తామని తెలిపారు. పవన్‌కుమార్, ప్రకాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చీలు

**నిర్మల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని గాజులపేట్‌లోని ప్రసిద్ధ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలతో అత్యంత శోభాయమానంగా అలంకరించబడింది. డిసెంబర్ 25న ఏసు క్రీస్తు జననం సందర్భంగా, ఆయన జీవితాన్ని తెలిపే ప్రదర్శనలతో కూడిన స్టాళ్లను ఏర్పాటు చేస్తారు. 25 రోజులుగా నిత్య ప్రార్థనలు జరుగుతున్నాయి.





## ఇరుముడి ధరించిన ఎమ్మెల్యే

### బరిమలకు బయలుదేరిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**


జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గురుస్వామి నగేష్ శర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఎమ్మెల్యే అయ్యప్ప స్వామి ఇరుముడిని ధరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతటా స్వామియే శరణం అయ్యప్ప శరణం నామస్మరణ మార్మోగింది. ఇరుముడి ధరించిన అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్వాములతో కలిసి శబరిమల యాత్రకు బయలుదేరారు. మార్గమధ్యలో మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ కలగాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రార్థించారు.

## ప్రజల పక్షాన నిలిచిన ఆకుల కిషన్

### ఓటమిలోనూ హామీ నిలబెట్టుకున్నారు

**ముథోల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

ముధోల్ మండలం ఆష్ట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బిజెపి యువ నాయకుడు ఆకుల కిషన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, ఓటమి పాలైనా కూడా వార్డులలో బోర్ వేయిస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, వారికి అండగా ఉంటానని, గెలుపోటములు సహజమని, ప్రజల సమస్యలు లేకుండా చేయడమే తన ధ్యేయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.





## 'మీ డబ్బు మీ హక్కు'తో.. క్లైయిమ్ చేయని

# సొమ్మును తిరిగి పొందవచ్చు

### మీ డబ్బు- మీ హక్కుపై కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం



**ఆదిలాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, వివిధ కారణాల వల్ల పది సంవత్సరాలుగా లావాదేవీలు జరగని ఖాతాల్లోని సొమ్మును ఖాతాదారులు లేదా వారి వారసులకు అందించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో "మీ డబ్బు-మీ హక్కు" అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్బీఐ సూచనల మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ పై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో సుమారు రూ.29 కోట్ల విలువైన డిపాజిట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా కొందరు ఖాతాదారులు/వారసులు క్లెయిమ్ చేయగా, బ్యాంకుల వారీగా నగదును ఎమ్మెల్యే పాయల శంకర్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఖాతాలు తెరిచి పది సంవత్సరాల పాటు ఎలాంటి లావాదేవీలు లేని ఖాతాలను బ్యాంక్ అధికారులు గుర్తించారన్నారు. ప్రజల సొమ్ము ప్రజలకే చేరేలా ఆర్బీఐ 'ఉద్గామ్' యాప్ ద్వారా సులభమైన విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సరైన అవగాహన లేక నామినీలు తెలియక ఖాతాల్లో డబ్బు అలాగే ఉండిపోయిందని చెప్పారు. ఉద్గామ్ యాప్ ద్వారా వివరాలు తెలుసుకుని, సంబంధిత బ్యాంకులను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే నగదును పొందవచ్చని సూచించారు. ఈ విషయంపై బ్యాంక్ సిబ్బంది, అధికారులు, మహిళా సంఘాలు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ, ఫైనాన్షియల్ రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్బీఐ మార్గదర్శకాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పది సంవత్సరాలుగా లావాదేవీలు లేని ఖాతాలను గుర్తించి, అందులోని డబ్బును ఖాతాదారుల వారసులకు అందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఓ, ఎన్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. గత నెల రోజులుగా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతు న్నాయని, ప్రజలు ఉద్గామ్ యాప్ ద్వారా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పాల్ కుమార్ దాస్, ఆర్బీఐ రాష్ట్ర అధికారి దామోదర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఓ, జడ్పీ సీఈఓ రవీందర్ రాథోడ్, డీఎంహెచ్ నరేందర్ రాథోడ్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో అట్టహాసంగా అథ్లెటిక్ టోర్నమెంట్



**మందమర్రి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో మందమర్రి ఏరియా డబ్ల్యూపీఎస్జీఏ ఆధ్వర్యంలో నియర్ బై అథ్లెటిక్స్ టోర్నమెంట్ అట్టహాసంగా చేపట్టారు. బుధవారం ఈ టోర్నమెంట్ ను ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బొంగు శంకర్, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకాలను పరిచయం చేసుకొన్నారు. అనంతరం క్రీడల ఉద్దేశించి వారు మాట్లాడుతూ సింగరేణి పేరును కోల్ ఇండియా లెవెల్ అథ్లెటిక్స్‌లో నిలబెట్టాలని అన్నారు. ప్రతి క్రీడాకారులలో, శ్రమ పట్టుదల ఉన్నాయని, వాటిని మరింత మెరుగు పరిస్తే విజయం ప్రతి ఒక్కరిని వరిస్తుందన్నారు. క్రీడాకారులను క్రీడాకారుల పరిచయ కార్యక్రమం తరువాత జండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి డబ్ల్యూపీఎస్ జీఏ హానరబుల్ సెక్రటరీ కార్తీక్, స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్మసకు ముస్తాబైన చర్చీలు

**బెల్లంపల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** క్రిస్మస్ వేడుకల నిమిత్తం బెల్లంపల్లి పట్టణంలోని అన్నీ చర్చీలు సర్వాంగ సుందరంగా అలంకరించబడ్డాయి. బుధవారం అర్ధరాత్రి నుండి మిడ్‌నైట్ ప్రత్యేక ప్రార్ధనలతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభిస్తారు. అందుకోసం ప్రధానమైన చర్చీల్లో ప్రత్యేక ఆకర్షణీయమైన విద్యుత్ లైట్లు, నక్షత్రాలు, క్రిస్మస్ చెట్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. యువకులు యేసుక్రీస్తు పుట్టుకను సూచించే పశువుల పాకను ఎంతో అందంగా తయారు చేశారు బంధుమిత్రుల రాకలతో సందడి వాతావరణం నెలకొంది. క్రిస్మస్ ముందస్తు వేడుకలు గత పక్షం రోజులుగా బెల్లంపల్లిలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు బుధవారం రాత్రి నుంచే ఆలయాల్లో ప్రార్ధనలతో వేడుకలు ప్రారంభమవుతాయి. ఆయా ప్రార్థనా మందిరాలకు క్రైస్తవులు కుటుంబ సమేతంగా చేరుకుంటారు. భక్తిశ్రద్ధలతో సామూహిక ప్రార్థనలు జరుపుతారు. క్రైస్తవ దేవాలయాల వద్ద వేడుకల సందడి నెలకొన్నది. వేడుకల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. సామూహిక ప్రార్ధనలకు దేవాలయాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. ఎప్పుడెప్పుడాని క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పర్వదినం కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని బెల్లంపల్లిలోని ఆయా దేవాలయాల్లో క్రీస్తు పుట్టిన పాకను ఏర్పాటు చేశారు. క్రీస్తు పుట్టిన పాక వద్ద క్రైస్తవ భక్తులు ముందుగా ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. అటు తర్వాత ఆలయాల్లోకి వెళ్ళి సామూహిక ప్రార్ధనలు జరుపుతారు. ఈ వేడుకల సందర్భంగా క్రీస్తు జననం జరిగిన పాకను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య ఘట్టం. కాగా ఈ సన్నివేశాన్ని క్రైస్తవ సోదరులు ఎంతో ఆసక్తితో తిలకిస్తారు.

## మాజీ ఫ్లోర్ లీడర్ ఉదారత

**నిర్మల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి బుధవారం మాజీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ఐఎన్‌ఆర్ పోశెట్టి పదివేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాగులవాడ కాలానికి చెందిన పోతన అనారోగ్యానికి కృపాడంతో ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మాజీ రాజేందర్ కాలనీ నాయకులు ఉన్నారు.



# జన సురక్ష పథకంపై అవగాహన

**చింతలమానేపల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** కొమురం భీం అసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం ఆడేపల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖ ఆధ్వర్యంలో జనసురక్ష పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యాజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల వివరాలను బ్యాంక్ అధికారులు వివరించారు. డ్వాక్రా రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ బ్యాంక్ లో తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడం జరుగుతుందని బ్యాంక్ మేనేజర్ తెలిపారు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు వయసు గలవారు సురక్ష బీమా యోజన పథకాన్ని కలిగి ఉండాలని,ఈ సందర్భంగా శాఖ నిర్వహణ అధికారి తెలియజేశారు. సురక్ష బీమా పథకానికి సంవత్సరానికి గాను 20 రూపాయల ప్రీమియం చెల్లించి రెండు లక్షల ప్రమాద బీమాను పొందవచ్చునని, అలాగే జీవనజ్యోతి బీమా యోజన పథకంలో 436 రూపాయలు సంవత్సరానికి చెల్లించి రెండు లక్షల సాధారణ లేదా ప్రమాద బీమా పొందవ చ్చునని తెలిపారు. కళాకారులతో డప్పు వాయిస్తూ పాటలు పాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆడేపల్లి సర్పంచ్ కోడిపే సుగుణ మాజీ సర్పంచ్ సంతోష్ గౌడ్ తెలంగాణ గ్రామీణు బ్యాంకు కౌటాల శాఖ వాసు డబ్బా సిఎస్పి గంట లక్ష్మి నారాయణ సిఏ జీవిత గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## బ్లాంకెట్ల పంపిణీ

**కాగజ్‌నగర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో చలి తీవ్రతకు లోనవుతున్న విద్యార్థినులు, మహిళలకు ఉపశమనం కల్పించేలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని మాణిక్యాపూర్ కస్తూర్బా గురుకుల పాఠశాలలో చలి అధికంగా ఉండటంతో అక్కడి బాలికలకు మొత్తం రెండు వందల నలభై ఐదు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సీవెల్ అధినేత బండారు సుబ్బారావు హైదరాబాద్ వాస్తవ్యులు వారి సహకారంతో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. అలాగే కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వేడినీటి సౌకర్యం అందించేందుకు నాలుగు గీజర్లు అందజేశారు. అలాగే, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో తీర్యాని మండలం భీంపూర్ గ్రామంలో కూడా సేవా కార్యక్రమం చేపట్టారు. అక్కడి 23 మంది మహిళలకు బ్లాంకెట్లతో పాటు చీరలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు రాచకొండ నాగేశ్వరరావు యువజన సంఘం సభ్యులు పాల్గొని సేవా భావాన్ని చాటారు.



# కంపు కొడుతున్న దవాఖాన పరిసరాలు

- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం..
- దవాఖానకు వచ్చేందుకు జంకుతున్న రోగులు



**కుభీర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రం కుభీర్ లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్వచ్ఛత లోపించి పరిసరాలన్నీ కంపు కొడుతున్నాయి. దవాఖాన మెయిన్ డోర్ ముందు పిచ్చి మొక్కలు పెరిగి బంజరు దొడ్డిలా దర్శనమిస్తోంది. దవాఖాన ముందు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు వంగి పోయినా పట్టించుకున్న వారు లేరు. దవాఖానకు ప్రతి రోజు వచ్చే రోగులు, నెలకోసారి వచ్చే గర్భిణీలు, బాలింతలు ముక్కు మూసుకుంటున్నారు. రోగాలకు చికిత్స అందించడం మాటేమో గానీ ప్రజలకు మరిన్ని రోగాలు ప్రబలేటట్టు ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దవాఖానలో కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. తాగునీటి వసతి, టాయిలెట్స్, యూరినల్స్ లేక రోగులు, మహిళా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెడ్లపై చద్దర్లు లేక వాసన వ్యాపిస్తోందని దవాఖాన లోపల ఊడ్చి, ఫినాయిల్ తో శుభ్రం చేయడం లేదన్న విమర్శలున్నాయి. రెండు వార్డులు ఉన్నా వాటికీ అద్దాలు పగిలిపోయి బయటినుండి దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో రోగులు దవాఖానలో ఉన్నంత సేపుఅసహనం తో గడుపు తున్నట్లు రోగులు వాపోతున్నారు. పేరుకే "రౌండ్ ది క్లాక్ ఆసుపత్రి" ఏనాడూ 24 గంటలు సేవలు అందించిన దాఖలాలు లేవు. మండలంలో 30 వరకు గిరిజన తండాలు గ్రామాలున్నాయి. ఇక్కడ సేవలందక ప్రైవేటు ఆర్ఎంపీ, పీఎంపీలలను ఆశ్రయించి రోగులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఇక్కడ ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఉండాల్సి ఉండగా ఒక వైద్యుడు, ఒక మేల్ స్టాఫ్ నర్సు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వ దవాఖాన ఉన్నా పేదవారికి కనీస వైద్యం, కనీస సౌకర్యాలు అందక పోవడం విడ్డురంగా ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులతో పాటు దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు నాకాబందీ

## ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలి - మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
జిల్లా వ్యాప్తంగా బుధవారం పోలీస్ నాకాబందీని నిర్వహించారు. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు ఒకే సారి నాకాబంది నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అనుమానిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల వివరాలు, వారు వెళ్లే ప్రదేశం వివరాలు, వాహనాలలో ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి నాకాబంధి నిర్వహించారు. వాహనాలను ఆపి వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్ నెస్, పొల్యూషన్ తదితర ధ్రువ పత్రాలను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేని వారు, వాహన ధ్రువ పత్రాలు లేని వారిపై పోలీస్ అధికారులు కేసులు నమోదు చేసి, జరిమానా విధించారు. అలాగే వారికి రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు నాకా బందీ నిర్వహిస్తున్నాం. జిల్లాలో అక్రమ రవాణా, ప్రభుత్వ నిషేధిత పదార్థాలు రవాణా, అనుమానిత వ్యక్తుల కట్టడి, నేరాల నియంత్రణ, అవాంఛనీయ సంఘటనలను అరికట్టడానికి, అనుమానితులు, దొంగిలించబడిన వస్తువులు, సరైన పత్రాలు లేని వాహనాలను పట్టుకోవడానికి, గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా కార్యకలాపాలు జరగకుండా కట్టడి చేయడంతో పాటు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి ఇతర నేరాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఈ ప్రక్రియను రాబోయే రోజుల్లో కూడా నిర్వహించి, తనిఖీలు మరింత కఠినంగా కొనసాగిస్తాం. ప్రజలు పోలీసులకు సహకరించాలని డీసీపీ భాస్కర్ కోరారు.



# నకిలీ ఆర్ఎంపీ డాక్టర్ అరెస్ట్

## ఇంజక్షన్ వికటించిన వృద్దురాలు మృతి

**సాత్నాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
అర్హత లేకుండా ఆర్ఎంపీ డాక్టర్గా చలామణి అవుతూ, హైడోస్ ఇంజక్షన్లు ఇచ్చి వృద్ధ మహిళ మృతికి కారణమైన నిందితుడిని అరెస్టు చేసినట్లు జైనథ్ సీఐ శ్రావణ్ తెలిపారు. బేల మండలం ఇందిరానగర్కు చెందిన ఊరవేత శాంతాబాయి (65) అనే వృద్ధ మహిళకు ఛాతి నొప్పి, తల తిరుగుడు ఉందని చెప్పగా, అర్హత లేకున్నప్పటికీ నిందితుడు లక్ష్మణ్ అనే వ్యక్తి ఆమెకు ఇంజక్షన్లు, గోలీలు ఇవ్వగా ఆమె ఆమె అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను 108 అంబులెన్స్ ద్వారా రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి ఉపయోగించిన సిరంజీలు, ఇంజక్షన్లతో పాటు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అర్హతలేని వైద్యులపై వద్ద చికిత్స తీసుకోవద్దని సూచించారు. అర్హత లేకుండా వైద్యం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

# అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ప్రభాకర్

**ఉట్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది పెందూర్ ప్రభాకర్కు కేంద్రంలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ప్రభాకర్ నియమితులయ్యారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# నర్సరీ నిర్వహణపై నిర్లక్ష్యం

**నార్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
అదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో గత ఏడాది మొక్కలను పెంచాలని ఉద్దేశంతో హరితహారం నర్సరీని ప్రభుత్వ కార్యాలయాల పక్కనే ఏర్పాటు చేశారు. ఈ నర్సరీలో వేలు ఖర్చు చేసి పదివేల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచారు. కాగా ఉన్నత అధికారుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో కరువై మొక్కల పెంపకం పై అంతగా ఆసక్తి చూపించినట్లు కనిపించడం లేదు. పంచాయతీ ఈజీఎస్ సిబ్బంది పట్టింపు లేని తనంతో పెంచిన మొక్కలు ఎండిపోయి అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం ఇతర గ్రామాల నుంచి కార్యాలయానికి వచ్చే ప్రజలు ఈ నర్సరీని చూసి ఆఫీసు పక్కనే ఉన్న నర్సరీ ఇలా ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చని, జిల్లా మండల అధికారుల పనితీరు ఏ మేరకు ఉందో ఈ నర్సరీయే నిదర్శనమని చర్చించుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నర్సరీలో ఎండు తున్న మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని అభిప్రాయపడుతున్నారు.



# సిర్పూర్ (యు) సర్పంచ్‌కు సన్మానం

## గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా
## సర్పంచు ఆత్రం ఓం ప్రకాష్



**జైనూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ (యు) నూతన సర్పంచ్ పదవి బాధ్యతలు స్వీకరించిన ఆత్రం ఓం ప్రకాష్‌ను బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బజార్‌గుడా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుంచం అందించి శాలవాతో సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామం లో ఉన్న ప్రధాన సమస్యలు వారీ దృష్టికి తీసుకుని వెళ్లారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆత్రం ఓం ప్రకాష్ సానుకూలంగా స్పందించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి నా లక్ష్యం అన్నారు. పారదర్శక పాలనా అందించి సమాన అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మెరుగైన డ్రైనేజీ, మంచినీళ్లు, వీధి దీపాలు, అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామ అభివృద్ధి కోసం యువత కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బజార్ గూడా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఆరిఫ్, జైస్వల్ నవీన్, ఇమ్రాన్ ఖాన్, షేక్ అమీర్, తదితరులు పాల్గొన్నారు.

# అడవిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

**సారంగాపూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మండలంలోని పెండల్‌దరి గ్రామంలో బుధవారం అటవీ వన్యప్రాణి చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ జీవి రామకృష్ణారావు వేసవిలో అటవీ ప్రాంతంలోకి వెళ్లే గిరిజనులు నిప్పు పెట్టవద్దని సూచించారు. అడవిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఆదివాసి గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నజీర్ ఖాన్, ఎఫ్ఎస్ఓ రషీద్, ఎఫ్బీఓలు వెన్నెల, సుజాత పాల్గొన్నారు.





## గర్భిణులకు మెరుగైన
# వైద్య సేవలు అందించాలి

- వంద శాతం గర్భిణీల వివరాలు నమోదు చేయాలి
- ఆసుపత్రులకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పించాలి
- మాతా శిశు సంరక్షణ కేంద్రం తనిఖీ
- వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్

**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** జిల్లాలో వంద శాతం గర్భిణీల వివరాలు నమోదు చేయాలని, ఆసుపత్రులకు వచ్చే వారికి అన్ని రకాలైన వైద్య సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంసీహెచ్‌లో అందిస్తున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు గర్భవతులకు అన్ని రకాల పరీక్షలు చేయించాలని, వారిని 102 అంబులెన్స్ సహకారంతో స్కానింగ్ కేంద్రానికి తరలించాలి. స్కానింగ్ కేంద్రంలో ఇచ్చిన ఈడీడీ ప్రకారం గర్భవతుల నమోదు ప్రక్రియను ఎన్సీపీ కార్డులో నమోదు చేయాలని, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి ప్రతి ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. అదే విధంగా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో హెల్ప్ డెస్క్ నుంచి ఫోన్ చేసి గర్భిణీల వివరాలు తెలుసుకోవాలన్నారు. గర్భవతులు ఏ ఆసుపత్రిలో ప్రసవం కోసం వస్తారో వారి వివరాలను ముందుగా తెలియజేయాలని, ఆసుపత్రికి వచ్చేవారికి సరైన సౌకర్యాలు కల్పించాలని, సాధారణ ప్రసవాలపైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సి సెక్షన్‌లు తగ్గించడం ద్వారా తల్లి బిడ్డలు క్షేమంగా ఉంటారని, మాతా శిశు సంరక్షణలో ఇది ముఖ్యమైన పాత్ర అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. మహిళా ఆరోగ్యంతో ఉంటే ఆ ఇంట్లో అందరూ ఆరోగ్యంగా ఉంటారని, కుటుంబ పరిస్థితులు మెరుగుపడతాయని, అదే విధంగా ఆర్థికంగా ఆరోగ్యంగా ఆ కుటుంబం ఉంటుందన్నారు. దీనితో గ్రామాలు, జిల్లాలు బాగుపడతాయి కావున ప్రతి ఆశ ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులు గర్భిణీలకు, మహిళలకు, తల్లులకు, ఇంటి వారికి సాధారణ ప్రసవాలపై అవగాహన కలిగించాలన్నారు. పుట్టిన పిల్లలకు నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో అత్యవసర సేవలకు సౌకర్యాలు కల్పించాలని, చిన్న పిల్లల వైద్యులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలను పరీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు కీటక జనిత వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటివి ప్రబలకుండా అత్యవసర చర్యలు చేపట్టాలని, ప్రతి వారంలో రెండు రోజులపాటు డ్రైడే పాటిస్తూ కీటక జనిత వ్యాధులను తగ్గించుకోవాలని, వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు పట్ల జాగ్రత్త పడాలని సూచించారు. మంచిర్యాల జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నందున వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భవతులు, బాలింతలు, జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి అవగాహన కలిగించాలన్నారు. అసంక్రమణ వ్యాధులు జీవనశైలిలో మార్పుల ద్వారా వచ్చే వ్యాధుల వలన చాలా మంది కష్టాలు పడుతున్నందున 30 ఏండ్ల పైబడిన వారందరికీ పరీక్షలు చేసి బీపీ, డయాబెటిస్ ను గుర్తించి చికిత్సలు అందించాలని, క్యాన్సర్ కు సంబంధించిన రోగులు ఎక్కువ ఉన్నందున వారిని గుర్తించడం, వారికి వైద్య సాయం అందించడం చేయాలన్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో క్యాన్సర్ వార్డును రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్



రవీందర్ నాయక్ సందర్శించి సిబ్బందికి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమం నడుస్తున్నందున ఆరోగ్య కార్యకర్తలు వారి ప్రాంతాలలో గ్రామాలలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని వైద్యులను ఆదేశించారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఎక్స్చేంజ్ ద్వారా వైద్య సేవలను గ్రామాలలో అందించాలని, పబ్లిక్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా తొందరగా వ్యాధిగ్రస్తులను గుర్తించడం, చికిత్స చేయడం, అవగాహన కలిగించడం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత, జీజీహెచ్ సూపరింటెండ్ డాక్టర్ వేదవ్యాస్, ఆర్ఎంఓ డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీమన్నారాయణ, సుధాకర్ నాయక్, అరుణ శ్రీ, ప్రసాద్, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యం అందిస్తున్న ప్రసూతి వైద్యులు, డిపిఓ ప్రశాంతి, పద్మ సిహెచ్‌ఓలు వెంకటేశ్వర్లు, సత్తయ్య, నాందేవ్, డెమో బుక్క వెంకటేశ్వర్, విశ్వేశ్వర రెడ్డి, అధికారులు, ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## విలువలతో కూడిన
# రాజకీయ నేత వాజ్‌పేయి

**ఆదిలాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** దేశ హితం కోసం అనునిత్యం పాటు పడిన గొప్ప మహనీయుడు మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి అని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మాజీ ప్రధాని వాజపేయ్ 101 జయంతిని పురస్కరించుకొని ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం రాత్రి దీపోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వాజపేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ... వాజపేయ్ అధికారం కోసం తాపత్రయ పడకుండా ప్రజా సేవకు పాటు పడ్డారని, నీతి నిజాయితీ గల రాజకీయ నాయకుడిగా ఎంతో పేరుగాంచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు సంతోష్, నగేష్, లాలా మున్నా, రాకేష్, దినేష్ మాటోలియా, రాజు, జోగు రవి, రఘుపతి, కృష్ణ యాదవ్, రాజేష్. తదితరులు ఉన్నారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో
# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి నాకాబందీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 31, జనవరి 1 వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల బిల్లులు చెల్లించాలి

## మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్



**నిర్మల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల బిల్లులు చెల్లించాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్ కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఏవోకు, డీఈవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, మెస్ చార్జీలు, కోడిగుడ్ల బిల్లులు, గత ప్రభుత్వంలో చేపట్టిన అల్పాహారం బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరారు. రాగిజావాకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని కోరారు. ఈ ధర్నాలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోదావరి, జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్ రాజేశ్వరి, లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు లక్ష్మి, సునీత, మంగా, మంజుల, గంగామణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

# అందరి సహకారంతో గ్రాభివృద్ధికి కృషి చేస్తా : సర్పంచ్ దుర్గం సరోజ



**బెజ్జూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** బెజ్జూరు గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సర్పంచి దుర్గం సరోజ అన్నారు. బుధవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తొలి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెజ్జూర్ మండల కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం, తీర్మానించారు. సమావేశంలో గ్రామపంచాయతీ పరిధిలోని వార్డుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వార్డుల వారీగా గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం ఏటిగూడా గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్, కార్యదర్శి వైకుంఠం. వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు ఉచిత
# నట్టల నివారణ మందులు పంపిణీ

**లక్ష్మణచాంద, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రమైన లక్ష్మణచాంద, చింతలచంద గ్రామాలలో గొర్రెలకు మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు, మొత్తం 3181 జీవాలకు తాగించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచులు లక్ష్మణచంద సర్పంచ్ వోస కవిత రాజు, చింతల్ చంద వోడ్నాలా వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. జీవాల పట్ల జాగ్రత్తగా ఉంచాలని.. వారికి అవసరమైన సమయంలో మందులు వేయాలని, లేదంటే నష్టపోతారని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జీకే శ్రీనివాస్, సంతోష్ జెవివో, విజయలక్ష్మి పాల్గొన్నారు.




# రాజకీయాలొద్దు..!



ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని మలేసియాలోని కౌలాలంపూర్‌లో నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 27న జరగనున్న ఈ ఈవెంట్‌పై అక్కడి పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఆడియో లాంచ్‌లో రాజకీయ కార్యకలాపాలకు పాల్పడవద్దని ముందస్తుగా హెచ్చరించారు.కౌలాలంపూర్‌లోని బుకిట్ జలీల్ స్టేడియంలో ఆడియో విడుదల వేడుకను నిర్వహించేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం 90వేల మంది విజయ్ అభిమానులు హాజరు కానున్నట్లు అంచనా. ఇప్పటికే రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న విజయ్.. అభిమానులను ఉద్దేశించి ఏమైనా వ్యాఖ్యలు చేయొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన రాయల్ మలేసియా పోలీసులు రాజకీయ ప్రసంగాలు, నినాదాలు చేయడం, బ్యానర్ల వినియోగంపై నిషేధం విధించినట్లు స్థానిక మీడియా పేర్కొంది.విజయ్ రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నేపథ్యంలో ఆయన నటిస్తున్న చివరి సినిమా ఇదేనట. హెచ్.వినోద్ తెరకెక్కిస్తున్న ఈ మూవీని కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. పూజా హెగ్డే కథానాయిక. మమిత బైజు, ప్రియమణి, బాబీ దేవోల్, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇది తెలుగులో బాలకృష్ణ నటించిన విజయవంతమైన సినిమా 'భగవంత్ కేసరి'కి రీమేక్‌గా రూపొందుతున్నట్లు కోలీవుడ్ టాక్. విజయ్ అభిమానులను అలరించేలా కథలో మార్పులు చేసినట్లు సమాచారం. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. హిందీలోనూ ఈ మూవీని 'జననేత' పేరుతో విడుదల చేస్తున్నట్లు కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రకటించింది. తాజాగా తెలుగులోనూ విడుదలై స్పష్టత వచ్చింది. 'జన నాయకుడు' పేరుతో ఏపీ, తెలంగాణల్లో పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ సినిమాను విడుదల చేస్తోంది.

# ది ప్యారడైజ్‌లో హీరోయిన్ ఫిక్స్!




వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్నారు హీరో నాని. ఆయన ప్రధాన పాత్రలో శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్' ఈ సినిమాలో నాని సరసన కయాదు లోహర్ నటించనున్నట్లు వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడీ వార్తలకు మరింత బలం చేకూరుస్తూ కయాదు ఓ వీడియో షేర్ చేశారు. తన ఇన్‌స్టాలో 'ది ప్యారడైజ్' గ్లింప్స్‌ను షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీలను జోడించారు. దీంతో నాని సరసన ఈ భామ ఖరారైనట్లు తెలుస్తోంది.ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కూడా కయాదు జాయిన్ అయినట్లు తెలుస్తోంది. ఆమెపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారని సమాచారం. త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న చిత్రమిది. తిరుగుబాటు, నాయకత్వంతో పాటు తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది. ఇందులో నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. మోహన్‌బాబు విలన్‌గా శికంజ మాలిక్' పాత్రలో నటిస్తున్నారు. ఇక 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాతో కయాదు లోహర్ తెలుగు ప్రేక్షకులనూ అలరించారు. ప్రస్తుతం ఈమె విశ్వక్‌సేన్ సరసన 'ఫంకీ' లోను నటిస్తున్నారు.



# శ్రుతిహాసన్ ట్రైన్ వచ్చేస్తుంది..


కోలీవుడ్‌లో చాలా కాలంగా నిర్మాణంలో ఉన్న చిత్రం 'ట్రైన్'.. విజయ్ సేతుపతి, నటి శ్రుతిహాసన్ జంటగా నటించిన చిత్రం ఇది. యూగీసేతు, నరేన్, సంపత్ రామ్ ముఖ్యపాత్రలు పోషించారు. నటుడు నాజర్, వి.క్రియేషన్ పతాకంపై కలైపులి ఎస్ థాను నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పాపులర్ దర్శకుడు మిష్కిన్ తెరకెక్కిస్తున్నారు. ఈయన చిత్రాలు వైవిధ్యంగా ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ట్రైన్ చిత్రం కూడా అదేవిధంగా ఉంటుందని భావించవచ్చు. ఇది విజయ్‌సేతుపతి, శ్రుతిహాసన్ రేర్ కాంబినేషన్లో రూపొందిన చిత్రం. ఇందులో విజయ్‌సేతుపతి, శ్రుతిహాసన్‌ల గెటప్ చాలా డిఫరెంట్‌గా ఉన్నాయి. శ్రుతిహాసన్ ఇటీవల వైవిధ్య భరిత కథా పాత్రలను ఎంపిక చేసుకుని నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ మధ్య సలార్, ఆ తరువాత రజనీకాంత్ హీరోగా నటించిన కూలీ చిత్రాల్లో ఈమె పాత్రలు అంతకు ముందు నటించిన పాత్రలకు భిన్నంగా ఉన్న విషయం తెలిసిందే. అదేవిధంగా ట్రైన్ చిత్రంలో కూడా శ్రుతిహాసన్ గెటప్ కొత్తగా ఉంది. ఈ చిత్రం ఎప్పుడు విడుదలవుతుందా అని ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు తాజాగా అప్‌డేట్‌ను యూనిట్ సభ్యులు వెల్లడించారు. ఈచిత్ర సింగిల్‌సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ పాట ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీంతో త్వరలోనే ట్రైన్ చిత్రం తెరపైకి రానుందని సమాచారం. మరో విషయం ఏమిటంటే తాజాగా విడుదలైన పాటను శ్రుతిహాసన్ పాడడం విశేషం. వచ్చే ఏడాది ప్రారంభంలోనే తెలుగు, తమిళ్‌లో విడుదల కానుంది.

# ఢిల్లీలో పెద్ది సందడి



'పెద్ది'గా ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమవుతున్నారు అగ్రహీరో రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా దిల్లీలో ఈ చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న రానుంది. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# రామోజీ ఫిల్మ్ సిటీలో జాన్ అబ్రహం యాక్షన్



ఈ ఏడాది 'ది డిప్లొమాట్', 'టెహ్రాన్' లాంటి వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించారు బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆయన.. దర్శకుడు రోహిత్ శెట్టితో కలిసి ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్నట్లు తెలిపింది చిత్రబృందం. ఈ షెడ్యూల్‌లో ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ సన్నివేశాల్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించాయి చిత్ర వర్గాలు. ముంబయి మాజీ పోలీసు కమిషనర్ రాకేశ్ మరియా జీవితం ఆధారంగా దీన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రాన్ని రోహిత్ శెట్టి తన మునుపటి సినిమాల కన్నా భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారని, త్వరలో మిగిలిన తారాగణానికి సంబంధించిన వివరాల్ని ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించాలి

### జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్



**ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

బాలలలో సత్యం, ధర్మం పట్ల నిబద్ధత, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో నిర్వహించనున్న వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకొని పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల, బెండర డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు దేశభక్తి, నైతిక విలువలపై అవగాహన కల్పించడం జరిగిందని, ధర్మం కోసం ప్రాణాలు అర్పించిన వీర బాలల త్యాగాన్ని గుర్తు చేసి, వారి విలువలను సమాజానికి తెలియజేయడం వీర్ బాల్ దివస్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.



## నేడు మంత్రి వివేక్ పర్యటన

**చెన్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

చెన్నూర్ నియోజకవర్గంలో రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్వెంకట స్వామి గురువారం పర్యటించనున్నారు. ఉదయం 6 గంటలకు రామకృష్ణాపూర్ ఆంధ్రా బ్యాంక్ వద్ద ఉన్న సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం మందమర్రి మార్కెట్ భగత్ సింగ్ నగర్ నుంచి శ్రీపతినగర్‌కు వెళ్లే సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభిస్తారు. సోమగూడెంలోని కల్వరి చర్చిలో జరిగే ప్రార్థన, జైపూర్ ఎస్టీ కాలనీలో రూ.25 లక్షలతో అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమి పూజ, మధ్యాహ్నం చెన్నూర్ ఐఈఏం చర్చిలో ప్రత్యేక ప్రార్థన, చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## విదేశీ విద్యకు స్కాలర్షిప్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు స్కాలర్ షిప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి అబ్దుల్ నదీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మైనార్టీ, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బౌద్ధ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీలో 60శాతం మార్కులు ఉండి, విదేశాల్లో ఉన్నత విద్య చదువుకోవాలనుకునే విద్యార్థులు జనవరి 19లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 20 వరకు హార్డ్ కాపీలను జిల్లా మైనార్టీశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

## 30న కలెక్టరేట్ పోటీలు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

వీర్‌బాల్ దివస్‌ను పురస్కరించుకుని ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మహిళాశిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల, బెండారా డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలపై అవగాహన కల్పించడంతోపాటు ధర్మం కోసం ప్రాణాలర్పించిన వీరబాలల త్యాగాన్ని గుర్తు చేయడమే వీర్‌బాల్ దివస్ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.

## ముగిసిన శ్రీ గండి రామన్న ఆలయ పాలకవర్గ పదవీకాలం

**నిర్మల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీ గండిరామన్న సాయిబాబా ఆలయ పాలకవర్గం పదవీకాలం ముగిసింది. గత ఏడాది డిసెంబర్ 23, 2024న నలుగురు ధర్మకర్తలు, ఒక ఎక్స్ ఆఫీషియో సభ్యునితో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. 23న వారి పదవీ కాలం ముగిసిపోయింది. దేవాదాయ శాఖ అధికారులు పాలకవర్గాన్ని పొడగిస్తూ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.



## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక



**ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

ఆశ్రమ బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోట్నాక రోషన్ రాష్ట్ర స్థాయి సీనియర్ బాలుర కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్ 23న ఆసిఫాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక క్రీడా పాఠశాలలో నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో కోట్నాక రోషన్ అద్భుతమైన ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 25 నుంచి 28 తేదీల వరకు కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న సీనియర్ బాలుర రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో అతను పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనక కర్ణు , పాఠశాల పీడీ హీరాబాయి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి, డీవైఎస్ఓ అష్ఫాక్ అహమ్మద్, గిరిజన క్రీడల అధికారి మడవి షేకు, ఆసిఫాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు కోవ లక్ష్మి, కబడ్డీ సెక్రటరీ ఆత్రం ధర్మారావు, ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, ఏటీడీఓ శివకృష్ణ, హెచ్డబ్ల్యూఓ మధుకర్, గోపాల్, కిరణ్, చంద్రశేఖర్, జగన్, ఖేలో ఇండియా కోచ్ కడతల రాకేష్‌తో పాటు పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

## ఉపాధి కోసం వలస వచ్చి.. మృత్యువాత

**వాంకిడి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

పక్కా రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వలస వచ్చి విద్యుత్ షాక్ తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. మహారాష్ట్రలోని రాజుర కోనత్ పూర్ గ్రామానికి చెందిన గౌరవ్ తులసీరాం నికోడే బుధవారం భావన నిర్మాణ పనులు చేసేందుకు మండలానికి వచ్చారు. ఈ క్రమంలో గోయగాం గ్రామానికి చెందిన మాడావి వాసు కు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి స్లాబ్ వేస్తుండగా.. సమీపంలోని విద్యుత్ తీగలు ఇనుప పైపుతో గౌరవ్ తులసీరాం విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే అతని వాంకిడి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆసిఫాబాద్ రెఫర్ చేయగా వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సకాలంలో వైద్యం అందక గౌరవ్ తులసీరాం మరణించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. వైద్యం కోసం వాంకిడి దవాఖానా తెస్తే.. 1 గంట వరకు ఎవరూ పట్టించుకోలేదు. వైద్యం చేసేందుకు డాక్టర్లు కూడా అందుబాటులో లేరని.. ఉన్న సిబ్బంది ఆసిఫాబాద్ రెఫర్ చేశారని వాపోయారు. డాక్టర్లు సకాలంలో వైద్యం అందిస్తే ప్రాణాలు నిలిచే వాని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ స్థలం కబ్జా : ఇద్దరి అరెస్ట్

**ఆదిలాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**





ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన మరో ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి 2015లో అప్పటి కలెక్టర్ 2400 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన గడుగు గంగన్న 2019లో ఫోర్జరీ పత్రాలను సృష్టించి ఆ స్థలాన్ని పట్టణంలోని బొక్కలగూడకు చెందిన వసీం కోకర్‌కు 2022లో రిజిస్ట్రేషన్ చేసి ఇంటి నంబర్ కూడా పొందాడు. దీనిపై రెవెన్యూ అధికారులు ఈ ఏడాది సెప్టెంబర్ 15న ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితులకు సహకరించిన రిక్షాకాలనీకి చెందిన కస్తూరి శ్రీనివాస్‌ను ఇది వరకే అరెస్టు చేయగా ప్రధాన నిందితులు గడుగు గంగన్న, వసీం కోకర్‌ను బుధవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ స్థలాల కబ్జాకు ఎవరు ప్రయత్నించినా వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

## నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీఎస్ సీఐ బుద్దె రవీందర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలంలోని బోరిగాం గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. వీరిలో 4 గురులు పేకాట రాయుళ్లు పట్టు బడ్డారు. వీరి వద్ద నుంచి రూ.19, 830 నగదు స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.






## నాణ్యమైన విద్య బోధన అందించాలి

**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల నస్పూర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ మౌనికతో కలిసి కేజీబీవీని తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని సూచించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషక విలువలు కలిగిన మెనూ అమలు చేస్తుందని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు చేసిన అల్లికలు, కళాకృతులను పరిశీలించి పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పది పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఏకాగ్రతతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు.

## ఇంధన్‌పల్లిలో వాహనాల తనిఖీ




**జన్నారం, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్సై గొల్లపల్లి అనూష ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు ద్విచక్ర వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని మద్యం సేవించి వాహనాలు నడిపిన మైనర్లకు వాహనాలు ఇచ్చిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## కపాస్ కిసాన్ యాప్‌లో మార్పులు

**తాండూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

సీసీఐ ఆదేశాల మేరకు కపాస్ కిసాన్ యాప్ నిబంధనల్లో మార్పులు చేశారని, స్లాట్ బుక్ చేసుకున్న రైతుల నుంచి అదనంగా ఐదు క్వింటాళ్ల పత్తిని తీసుకుంటామని జిల్లా మార్కెటింగ్ అధికారి షాబొద్దీన్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌తెలిపారు. గురువారం అర్ధరాత్రి నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. పరిమితికి మించి పత్తిని సీసీఐ కొనుగోలు చేయబోదని, రైతులు సహకరించాలని కోరారు.



# పల్లెలపై వరాల జల్లు..

- సర్పంచ్‌లకు సీఎం న్యూ ఇయర్ గిఫ్ట్
- మేజర్ పంచాయతీలకు రూ.10లక్షలు
- మైనర్ జీపీలకు రూ.5లక్షలు
- ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధం లేకుండా నిధులు
- గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి
- పార్టీలు పక్కన పెట్టి డెవలప్ మెంట్ పై దృష్టి పెట్టాలి
- బాగా పని చేయండి
- కేసీఆర్ కుటుంబానికి అధికారం రానివ్వం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

**పల్లెలపై సీఎం రేవంత్ రెడ్డి వరాలజల్లు కురిపించారు. గ్రామ పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామ పంచాయతీలకు రూ.5లక్షలు, పెద్ద పంచాయతీలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సంబంధం లేకుండా ప్రత్యేక నిధులు వస్తాయని, వీటిని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు గ్రామాల్లో సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్‌లకు సీఎం సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులకు ఈ నిధులు అదనమని స్పష్టం చేశారు. నూతన సంవత్సరంలో ఈ ప్రత్యేక నిధులను అందజేస్తామని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని, ఇతర పార్టీ నుంచి గెలిచారనే వివక్ష ఎక్కడా ఉండొద్దన్నారు. చిన్న,చిన్న విభేదాలు, సమస్యలు ఉంటే వాటన్నింటినీ పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధిపై ఫోకస్ చేయాలని సూచించారు.**

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

"ఎన్నికలు అయిపోయాయి.. ఇక రాజ కీయాల్లేవు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే పార్టీలు, పంథాలు ఉండాలి. తెలంగాణ రాష్ట్రానికి నాయకత్వ వహిస్తున్న మనం అందరినీ కలుపుకొని పోదాం. నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదని' సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన కొత్త సర్పంచ్‌లతో నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో సీఎం రేవత్ రెడ్డి పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను సన్మానించిన సీఎం రేవంత్.. గ్రామాల అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ఏడాదిలో గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులను రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

**పల్లెలకు ప్రత్యేక నిధులు..**

కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి వచ్చే నిధులకు అదనంగా ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పంచాయతీలకు సాధారణంగా అందే నిధులు కాకుండా.. ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులను కేటాయిస్తామని ప్రకటించారు. అయితే చిన్న గ్రామాలకు ఒక్కొక్కదానికి రూ. 5లక్షలు.. పెద్ద పెద్ద గ్రామాలకు ఒక్కోదానికి రూ. 10లక్షలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో ఎలాంటి సంబంధం లేకుండా మంజూరు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**ఈ మంచిగా పని చేసుకోండి..**

కొత్తగా ఎన్నికైన సర్పంచ్లకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక అభివృద్ధి నిధులను ఉపయోగించాలని పేర్కొన్నారు. దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని గాంధీజీ చెప్పారని, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పేదలకు పథకాలు చేరిన పుడే నిజమైనపాలన అందుబాటులోకి వస్తుందని వివరించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను పార్టీలు చూడకుండా గ్రామాలను అభివృద్ధి చేయాలని.. ఇతర పార్టీ నుంచి గెలిచారనే వివక్ష ఎక్కడా ఉండొద్దని తేల్చి చెప్పారు. చిన్న చిన్న విభేధాలు, సమస్యలు ఉంటే వాటన్నింటినీ పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని తెలిపారు. కేసీఆర్ కుటుంబానికి అధికారం రానివ్వ.. తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలుతీస్తానంటున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు, స్థాయిలేని విమర్శలని రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. గతంలో తనను తన కుటుంబాన్ని, ఎన్నో విధాలుగా ఇబ్బందులు పెట్టారని, పగ సాధించడం మెదలు పెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టానని పేర్కొన్నారు. తాను ప్రమాణ స్వీకారం చేసినప్పుడే కూలబడ్డారని, ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుందని అన్నారు. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకున్నారని, చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుందన్నారు. తనను గెలకవద్దని, మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదని పేర్కొన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే 2/3 వంతు మెజార్టీతో 80కిపైగా సీట్లతో మళ్లీ తామే అధికారంలోకి వస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఒకవేళ 153 సీట్లయితే 100కిపైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్ చరిత్ర ఖతమేనని, ఆ పార్టీకి, నాయకుకు భవిష్యత్ లేదని చెప్పారు.

# భీమ్ సొసైటీపై చర్యలు తీసుకోవాలి



**వాంకిడి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డ్స్‌తో పాటు ఇతర ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న భీమ్ సొసైటీపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు బుధవారం వైద్యాధికారి అయేషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ వాంకిడి సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఉద్యోగులు చాలిచాలని వేతనాలు తీసుకుంటు కుటుంబాన్ని ఫోషిస్తూ ఆసుపత్రిలో వచ్చే రోగులకు సేవలు అందిస్తున్నారని అన్నారు. ఐదు నెలల నుంచి భీమ్ సొసైటీ వారు వేతనాలు చెల్లించక పోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్నారని ఆయన చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి వారికి గుర్తింపు కార్డులు అందించి జాతీయ సెలవులు మంజూరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పిప్పిరి వెంకటేష్, తిరుపతి, ఆసుపత్రి సిబ్బంది దినకర్, చంద్రశేఖర్, జమున, గౌరుబాయి, భాత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# లోక రక్షకుడి రాక కోసం.

క్రిస్మస్ వేడుకులకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సిద్ధమైంది. యేసుక్రీస్తు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను నిర్వహిస్తారు. గురువారం జరిగే క్రిస్మస్ పండుగకు క్రైస్తవ సంఘాలతో పాటు క్రైస్తవేతరులు కూడా వేడుకలు నిర్వహించనున్నారు. పలు చర్చిలలో బుధవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ పర్వ దిన వేడుకలు అరంభమయ్యాయి. పండుగ రోజు ఆది వారం ఉదయం 9:30గంటలకు చర్చిలలో క్రిస్మస్ ఆరాధ నలలో క్రైస్తవులు పాల్గొంటారు. పట్టణంలోని చర్చిలను సందర్శించి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు సందర్శించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేస్తారు. రాత్రి నుంచే.. క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి నుంచే ఆరంభమయ్యాయి. కొన్ని చర్చిలలో రాత్రి 12గంటల వరకు క్రిస్మస్ ఆరాధనలు జరిగాయి. పశువుల పాకలో క్రీస్తు జనన దృశ్యాలు, నక్షత్ర ప్రదర్శనలతో ప్రార్థనలు నిర్వహించారు. మహానగరంలోని హెూటళ్లు, బేకరీలు, వ్యాపారసంస్థలలో కూడా సంబురాలు జరుపుకున్నారు. క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు, సొంటాక్లాజ్‌ల ప్రదర్శన, ప్రత్యేక అలంకరణల నడుమ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. హ్యాపీ క్రిస్మస్. మేరీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా చర్చిలు వేడుకలకు ముస్తాబయ్యాయి. రంగులు వేసి.. విద్యుద్దీపాలను అమర్చి శోభాయమానంగా ముస్తాబు చేశారు. కూడళ్లలో విద్యుత్ కాంతులు, స్టార్‌లను ఏర్పాటు చేశారు. పలుచోట్ల సొంటాక్లాజ్‌ల బొమ్మలను ప్రదర్శించారు. ప్రముఖ వ్యాపార సంస్థలు ప్రత్యేక అలంకరణలతో కళకళలాడాయి. లక్షెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చికి ఘన చరిత్ర ఉంది. ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల్లోనే అతిపెద్ద రెండో చర్చిగా పేరు గాంచింది. 1935లో ఆంగ్లేయులు నిర్మించగా, మతసామ రస్యాలకు ప్రతీకగా నిలుస్తున్నది. దూరం నుంచి చూసిన ప్పుడు మినార్లతో మసీదువలే.. లోపలికి వెళ్తే మందిరం వలే.. ప్రధాన ద్వారం వద్ద నిలబడి చూస్తే చర్చిలో ఉన్నా మనే భావన కలుగుతుంది. ఈ చర్చి సుమారు 80 ఎక రాల్లో విస్తరించి ఉంది. దీని ఆవరణలో టేకు వనం చూప రులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నది. ఒకేసారి వేలాది మంది ప్రార్థన చేసుకోవచ్చు. 1940లో అతి పెద్ద మిషన్ దవాఖాన ఉండేది. అది మూతపడి చాలా ఏళ్లు కావస్తు న్నది. దీని ప్రాంగణంలో వందేళ్లపై బడిన ఊడలమర్రి ఉంది. ఈ చర్చి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 1975 నుంచి ఇక్కడ వసతి గృహంతో కూడిన ఆశ్రమ పాఠశాల కొసాగుతోంది.



# క్రిస్మస్..రుచుల విందు



క్రిస్మస్ క్రైస్తవులకు చాలా ముఖ్యమైన పండుగ. క్రిస్మస్ వస్తోందంటే సందడే సందడి. శాంతాక్లాజ్ అందించే కానుకలు, జింగిల్ బెల్స్ సందడి,, నక్షత్రాల వెలుగులూ, ఆత్మీయులతో కలిసి పండుగ జరుపుకోవడం.. ఈ ఆనందాల సమయంలో నోరు తీపి చేసుకునేందుకు కచ్చితంగా కేక్‌లూ, బిస్కెట్లూ, పిండి వంటలూ ఉండాల్సిందే. ఈ సరదాల కలగలుపు పండుగను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ప్రపంచ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా జరుపుకుంటున్నారు. ఈ క్రిస్మస్ పండుగకు ప్రత్యేకంగా కేకులు తయారు చేస్తారు. పిల్లలే కాదు.. ఇంటిల్లిపాదీ రుచిరుచిగా తినేందుకు అనువైన అటువంటి పదార్థాలకు ప్రాధాన్యతనిస్తారు. క్రిస్మస్ నాడు ఇంటికి వచ్చిన అతిథులకు క్రిస్మస్ శుభాకాంక్షలను తీపిదనంతో అందించేందుకు ఆ కుటుంబాలు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో ప్రత్యేకంగా తయారు చేసే క్రిస్మస్ పుడ్డింగ్‌కు క్రిస్మస్ రోజున రాత్రి డిన్నర్‌కు సర్వ్ చేస్తారు. దీన్నే ప్లమ్ పుడ్డింగ్ అని కూడా అంటారు. ఈ పుడ్డింగ్‌కు డ్రై ఫ్రూట్స్ జోడించడం వల్ల ప్రత్యేకమైన రుచి, రంగు కలిగి నోరూరిస్తుంటుంది. మరి క్రిస్మస్ పుడ్డింగ్ ఎలా తయారు చేస్తారో చూద్దాం..

### ప్లమ్‌కేక్/ఫ్రూట్‌కేక్‌కు కావలసిన పదార్థాలు

**క్యారమెల్‌కు..**

| | |
|---|---|
| షుగర్ | : 1 కప్పు |
| నీళ్లు | : 1 కప్పు |

**కేక్ కోసం కావల్సినవి..**

| | |
|---|---|
| రమ్/బ్రాంది లో నానబెట్టిన పండ్లు | : 3 కప్పులు |
| రమ్ | : 2 స్పూన్స్ |
| మైదా | : 2 కప్పులు |
| ఇన్స్టెంట్ కాఫీ పొడి | : 1 స్పూన్ |
| బేకింగ్ పౌడర్ | : 2 స్పూన్స్ |
| దాల్చిన చెక్క పొడి | : 1 స్పూన్ |
| లవంగం పొడి | : 1 స్పూన్ |
| యాలకుల పొడి | : అర స్పూన్ |
| జాజికాయ పొడి | : అర స్పూన్ |
| ఉప్పు | : తగినంత |
| డార్క్ బ్రౌన్ షుగర్ | :1 కప్పు |
| గుడ్లు | : 5 |
| వెనిలా సారం | :2 స్పూన్‌లు |
| పంచదార పాకం | : కప్పు |

**తయారు చేసే విధానం :** ముందుగా పాన్‌లో షుగర్ తీసుకోవాలి. ఈ పాన్‌నున స్టౌ మీద పెట్టి, పంచదార బాగా పూర్తిగా కరగపెట్టాలి. స్పూన్ ఉపయోగించకూడదు. పంచదార బాగా కరిగి కొద్దిగా బ్రౌన్‌కలర్‌కు మారేవరకూ అలాగే ఉంచాలి. బ్రౌన్ కలర్‌కు మారగానే పాన్ స్టౌ మీద నుంచి తీసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత అందులో నీళ్లు పోయాలి. స్పూన్‌తో నిదానంగా బాగా మిక్స్ చేయాలి. తిరిగి ఒక నిముషం ఉడికించుకోవాలి. స్టౌ మీద నుంచి దించి, ఈ క్యారమెల్‌ను చల్లారనివ్వాలి.

**ప్లమ్ కేక్ తయారు చేయడానికి..** ఓవెన్‌ను 160 డిగ్రీ సెం.హీట్ చేయ్యాలి. అందులో లైట్ 2 వరకూ గ్రీజ్, లైన్ 2.8 లీ, 2 అంగుళం ఉన్న పాన్ తీసుకోవాలి. (సింగల్ టేలర్ పాన్‌ను కూడా ఉపయోగించవచ్చు. కానీ బేకింగ్ సమయంలో ఎక్కువ తీసుకుంటుంది.) ఇప్పుడు ఒక బౌల్లో మైదా, కాఫీ పౌడర్, బేకింగ్ పౌడర్, దాల్చిన చెక్క పొడి, లవంగాల పొడి, యాలకుల పొడి, జాజికాయ పొడి, సాల్ట్‌వేసి మిక్స్ చేయాలి. తర్వాత బట్టర్, షుగర్‌ను ఒక బౌల్లో వేసి ఎలక్ట్రిక్ బీటర్‌లో బాగా గిలకొట్టాలి. గుడ్లు పగలగొట్టి అందులో పోసి మరోసారి గిలకొట్టాలి. అలాగే వెనీలా సారం, క్యారమెల్ కూడా వేసి గిలకొట్టాలి. ఇప్పుడు అందులో డ్రై మిక్సర్ కూడా వేసి బాగా మిక్స్ చేయాలి. నానబెట్టుకొన్న పండ్లను, రసాన్ని కూడా అందులో వంపుకోవాలి. దీన్ని తయారుచేసే పాన్‌లో పోయాలి. ఇప్పుడు దాదాపు 55-60 నిమిషాలు టూత్ పిక్ క్లీన్‌గా బయటకు వచ్చే వరకూ బేక్ చేయాలి. కేక్ పాన్‌ను చల్లారనిచ్చి, పాన్ నుండి పక్కకు తీసుకోవాలి. కేక్ పైన అక్కడక్కడ చిన్న చిన్న రంధ్రాల్లా పెట్టి అందులో రమ్‌ను చిలకరించాలి. ఇప్పుడు దీన్ని మూత గట్టిగా ఉండే బాక్స్‌లో పెట్టాలి. ఈ కేక్‌ను బేక్ చేసిన రెండు, మూడు రోజుల తర్వాత తింటే చాలా రుచిగా ఉంటుంది.



### క్రిస్మస్ పుడ్‌కు కావలసిన పదార్థాలు


| | |
|---|---|
| పాలు | : 1 లీటరు |
| పంచదార | : సరిపడినంత |
| అరెంజ్ తొనలు | : 12-14 |
| ఆపిల్ | : 1 |
| (పై పొట్టు, గింజలు తీసి చిన్ని చిన్న ముక్కలుగా తరగాలి) | |
| కిస్‌మిస్, బాదం, జీడిపప్పు పలుకులు | : 1 కప్పు |
| బ్రెడ్ స్లైస్ | : 4-6 |

**బేస్ తయారీకి**

| | |
|---|---|
| బిస్కెట్స్ | : 2 కప్పులు |
| వెన్న | : 3 స్పూన్‌లు |

**తయారు చేసే విధానం:**

**బేస్ తయారీకి:** బిస్కట్ ముక్కలకి వెన్నని బాగా పట్టించి ఆ మిశ్రమాన్ని బేకింగ్ డిష్ అడుగు భాగంలో సర్ది కదలకుండా ఉండేలా చేతులతో వత్తాలి. ఈ గిన్నెని గంటపాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆలోపు పుడ్డింగ్‌ని తయారు చేసుకోవాలి. తాజా బ్రెడ్ ముక్కలని చిన్న చిన్న ముక్కలుగా తుంచి పెట్టుకోవాలి. ఆ తర్వాత మందపాటి గిన్నెలో పాలుపోసి సగమయ్యేదాకా సన్నని సెగమీద మరిగించాలి. దించి పంచదార, బ్రెడ్ ముక్కలు వేసి కలిపి చల్లారనివ్వాలి. ఇందులో కోసి ఉంచిన ఆపిల్, డ్రైఫ్రూట్స్ వేసి కలిపి బేస్ తయారు చేసి ఉంచుకున్న గిన్నెలో పోయాలి. గిన్నెను కుక్కర్‌లో పెట్టి పది పన్నెండు నిమిషాలు సన్నని సెగమీద ఉడికించాలి. అప్పటికి సగం ఉడుకుతుంది. దానిమీద చుట్టూ గుండ్రంగా ఆపిల్ ముక్కలు సర్ది మళ్లీ పన్నెండు నిమిషాలు ఆవిరి మీద ఉడికించాలి. తర్వాత దించి మూత తీసి చల్లారనివ్వాలి. దీనిని కనీసం రెండు,మూడు గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచి తింటే చాలా రుచిగా ఉం టుంది.







# డయాబెటిస్

# లక్షణాలు ఉన్నాయా..?

## అయితే అలర్ట్‌గా ఉండాల్సిందే

హెల్త్ డెస్క్, ప్రభాత సమాచారం

ఏటా డయాబెటిస్ కేసులు పెరుగుతున్నాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా చాలామంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. దేశంలో 10 కోట్లకు పైగా మధుమేహ బాధితులు ఉన్నారని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇక ఒక్కసారి డయాబెటిస్ ఎటాక్ అయ్యిందంటే జీవనశైలిలో ఎన్నో మార్పులు చేసుకోవాల్సి వస్తుంది. అయితే ఈ వ్యాధి విషయంలో అతి పెద్ద సమస్య, దీని లక్షణాలు ఆలస్యంగా గుర్తించడమేనట. అయితే ఉదయం నిద్రలేచిన తర్వాత కొన్ని రకాల లక్షణాలు కనిపిస్తే అలర్ట్ కావాల్సిందే అని నిపుణులు అంటున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.

**అంటువ్యాధిలా డయాబెటిస్ :** ప్రజల జీవనశైలిలో మార్పులతో పాటు ఫ్రైడ్, జంక్ ఫుడ్ నిత్య జీవితంలో భాగమైంది. దీంతో పాటు మద్యం అలవాటు పెరిగిపోతోంది. వేళకు నిద్ర పోకపోవడం, ఆలస్యంగా మేల్కోవడం కూడా టైప్-2 డయాబెటిస్ పెరగడానికి కారణ మవుతోంది. ప్రస్తుతం దేశంలో డయాబెటిస్ అనే వ్యాధి ఒక అంటువ్యాధిలాగా వ్యాపిస్తోంది.

**మీలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? :** ఉదయం నిద్ర లేచిన సమయంలో కొన్ని లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయొద్దని డాక్టర్ అజిత్ చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం నిద్ర లేచిన అనంతరం అలసటగా ఉన్నట్లు అనిపించినా, తరచూ మూత్ర విసర్జన చేయాల్సి వచ్చిన నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు. వీటితో పాటు గొంతు ఎండిపోవడం, అకస్మాత్తుగా ఆకలి పెరగడం లేదా తగ్గడం డయాబెటిస్ లక్షణాలు కావచ్చునని పేర్కొన్నారు. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని తెలియజేస్తున్నారు. ఒకవేళ ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అనంతరం దానికి తగినట్లుగా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

**మధుమేహాన్ని ఎలా నివారించాలి :** ఒకవేళ డయాబెటిస్ వచ్చినా రోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయడం వల్ల ఈ సమస్యను అదుపులో ఉంచుకోవచ్చునని డాక్టర్ అజిత్ జైన్ పేర్కొంటున్నారు. దీంతో పాటు రోజూ గంటపాటు ఉదయం లేదా సాయంత్రం వాకింగ్ చేయాలని సూచిస్తున్నారు. అంతే కాకుండా మీరు తీసుకునే ఆహారంలో చక్కెర, ఉప్పు మొత్తాన్ని తగినపాళ్లలో ఉండేలా చూసుకోవాలని, ప్రతిరోజు కనీసం 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలని చెబుతున్నారు. అలాగే ఫాస్ట్‌ఫుడ్, సాఫ్ట్ డ్రింక్స్ ,స్వీట్లు లాంటి వాటికి ఎంత దూరంగా ఉండే అంత మంచిదని డాక్టర్ అజిత్ జైన్ సూచించారు.

> టైప్-1 డయాబెటిస్ జన్యుపరమైన కారణాల వల్ల, టైప్-2 డయాబెటిస్ సరైన ఆహారపు అలవాట్లు పాటించకపోవడం వల్ల వస్తుంది. గతంలో 50 సంవత్సరాల తరవాత టైప్-2 డయాబెటిస్ వచ్చేది కానీ, ప్రస్తుతం 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు వారు కూడా దీని బారిన పడుతున్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు డయాబెటిస్ సమస్యకు ప్రధాన కారణం.
>
> **బి.డాక్టర్ అజిత్ జైన్,**
> రాజీవ్ గాంధీ హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్, ఢిల్లీ

# అధికార దర్జా.. కన్నుపడితే కబ్జా!






- ప్రభుత్వ భూములకు ఎసరు పెడుతున్న ప్రజాప్రతినిధి
- బెల్లంపల్లి నియోజకవర్గంలో యథేచ్ఛగా భూ కబ్జాలు
- అధికార పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి శాసించే స్థాయికి..
- బెల్లంపల్లి డివిజన్‌లో అధికార పార్టీ నాయకుడి ఆగడాలు
- ఇప్పటికే విలువైన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం
- కోట్లాది విలువైన భూమి కాజేతకు ఆ నాయకుడి కుట్ర
- నకిలీ పత్రాలతో యథేచ్ఛగా సాగిస్తున్న భూదందాలు
- ఫెన్సింగ్ వేసిన భూములు గుట్టుచప్పుడు కాకుండా స్వాహా
- బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములకు కరువైన రక్షణ
- రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోని వైనం

■ ప్రభాత సమాచారం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి

**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోఅధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి భూదాహానికి అడ్డుఅదుపూ లేకుండాపోతోంది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జాకు పాల్పడుతున్నారు. కొండలు, గుట్టలు, పోరంబోకు భూములు ఇలా... దేన్నీ వదలకుండా అమాంతం ఊడ్చేస్తున్నారు. ప్రభుత్వ భూములపైనా రాబందుల్లా వాలిపోతున్నారు. ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను తమ సొంత ఆస్తుల్లా పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో పట్టణంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆయన ప్రభుత్వ భూములపై కన్నేశారు. సంబంధిత అధికారుల ఉదాసీనత, రికార్డులోని లోపాలను ఆసరాగా చేసుకుని భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. వీరికి రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో ఈ వ్యవహారం సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూములను పట్టపగలే చదును చేయడం, దొంగ దస్తావేజులు సృష్టిస్తూ రాత్రికి రాత్రే వాటిలో నిర్మాణాలు చేపట్టడం ఇక్కడ సర్వసాధారణమైంది. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుడు భూ కజ్జాలకు పాల్పడుతున్నా.. బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. అధికారుల మౌనం అధికార పార్టీకి చెందిన ఆ నాయకుడికి భూ కబ్జాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు కబ్జా దారుల చేతుల్లోకి మారుతున్నాయి. ప్రభుత్వ భూములు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే అధికారులు తమ వంతు బాధ్యతలను నెరవేర్చడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఆ నాయకుడు ఆయన అనుచరులు వ్యక్తులుగా, సమూహాలుగా ఏర్పడి మరీ భూకబ్జాలకు ఎగబడుతున్నారు. ఆక్రమిత భూముల్లోనూ దర్జాగా వ్యవసాయం సాగు, రియల్ ఎస్టేట్, అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. బెల్లంపల్లిలో భూ కబ్జాలు అంతా ఓపెన్ సీక్రెట్ అయిపోయింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తనకేమీ తెలియనట్లు నటించడం పరిపాటైంది. అధికారుల వ్యవహార తీరు భూ కబ్జాలకు ఊతమిచ్చినట్టుగా కనిపిస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు జాగా ఖాళీగా కనిపిస్తే చాలు అధికార పార్టీకి చెందిన ఆ నాయకుడు కబ్జా చేస్తున్నారు. ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి మున్సిపాలిటీ, గ్రామపంచాయతీల నుంచి హౌస్ నంబర్లు పొంది వాటితో కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో సంబంధిత అధికారులు కబ్జాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మీడియాలో కథనాలు వస్తే అధికారులు అప్పటికప్పుడు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ కబ్జాదారులు మాత్రం జాగాలను ఖాళీ చేయడం లేదు. ఫలితంగా ఇప్పటికే పట్టణంలో కోట్ల విలువైన ప్రభుత్వ, సింగరేణి స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. బెల్లంపల్లి పట్టణం, మండలంలో అసైన్డ్ భూములే ఎక్కువగా కబ్జాకు గురవుతున్నాయి. వీటిని లక్ష్యంగా చేసుకుని అధికార అండతో భూ కబ్జాను ప్రధాన దందాగా మార్చుకున్నారు. మండలంలోని కన్నాల ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న అసైన్డ్ భూములన్నీ కబ్జాకు గురైనవే. అంగబలం అర్థబలం మాటున అసైన్డ్ భూములన్నీ కబ్జాకోరుల చేతిలో బందీ అయ్యాయి. ఈ విషయం అందరికీ విదితమే. కబ్జాలు ఎన్ని జరిగినా గప్ చుప్‌గా ఉండిపోవడమే ఇక్కడ రాజనీతి అధికారులు వ్యవహరిస్తున్నారు. వందల ఎకరాలు ప్రభుత్వ రికార్డుల నుంచి మాయమైపోతున్నాయి. ఇక్కడ ఖాళీగా ఉన్న అసైన్డ్ ల్యాండ్లు అక్రమార్కుల గుప్పిట్లోకి మారడం నిత్యకృత్యం. అక్రమ కట్టడాలు ఇక్కడ సర్వసాధారణ. చాలావరకు సింగరేణి కంపెనీ లీజ్ భూములు ఎక్కువగా ఉన్నాయి. సింగరేణి భూములు, అసైన్డ్ భూములు సైతం కబ్జాకు అతీతమేమీ కాకుండా పోయాయి. ఖాళీ భూములన్ని కబ్జా పర్వంలోనే మగ్గుతున్నాయి. చివరికి ప్రభుత్వం ముస్లీం మైనార్టీలకు కేటాయించిన షాదీఖానా భూములు కూడా కబ్జాకు గురయ్యాయి. ఆ స్థలంలో అక్రమ కట్టడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. బెల్లంపల్లి పోచమ్మ చెరువు సమీపంలో ఉన్న అసైన్డ్ భూములుకబ్జాలోకి మారాయి. తాజాగా నాలుగు ఎకరాల అసైన్డ్ భూమి కబ్జాకు గురైంది. భూకబ్జాదారులు ఆక్రమిత భూముల్లో యథేచ్ఛగా పంట సాగు చేస్తున్నారు. ఆక్రమించుకున్న భూములకు చుట్టూ కంచె వేశారు. కబ్జాకోరులు భూములను శాశ్వతంగా తమ ఆధీనంలోనే ఉంచుకుంటున్నారు. కబ్జా చేసి తమ ఆధీనంలోనే ఉంచుకుంటున్నారంటే..? కబ్జాదారుల ధీమా ఏంటో అర్థం కాని విషయమేమి కాదు.

**సామాన్య కార్యకర్త నుంచి శాసించే స్థాయికి...**

బెల్లంపల్లిలో అతను అధికార పార్టీకి చెందిన ఓ సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఇప్పుడు అందరినీ శాసించే స్థాయికి ఎదిగాడు.. కొంత మంది అధికారులు సైతం అతని కనుసన్నల్లో పని చేస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు.. అనతి కాలంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో బెల్లంపల్లి పట్టణంలో ప్రముఖ నాయకుడిగా పేరు తెచ్చుకున్న ఆయన భూ దందాలకు అడ్డుఅదుపులేకుండా పోతోంది.. అధికారమే అండగా ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆ నాయకుదే అన్నట్లు మారింది.. దీనికి తోడు అతనికి కొంత మంది అధికారులు సైతం వంతపాడుతూ లబ్ధిపొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆ నాయకుడు వారి అనుచరులను గెలిపించుకునేందుకు భారీత మొత్తంలో ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది..

**ప్రభుత్వభూములకు రక్షణేది..?**

బెల్లంపల్లిలో అసైన్డ్ భూముల రక్షణపై అధికారులు మొదటి నుంచి నిర్లక్ష్యంగానే ఉంటున్నారు. దీన్ని ఆసరా చేసుకుని భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఆక్రమించున్న భూములను కబ్జాదారులు సొంతమనుకుంటున్నారు. అట్టి భూములపై అధికారుల మౌనం వారికి బాసట నిస్తుంది. ఆక్రమిత భూములకు కంచె వేసుకుని కబ్జాదారులు కాపాడుకుంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు గుంట భూమికి కంచే వేసి కాపాడిన సందర్భాలు మచ్చుకు కనిపించవు. భూ అక్రమాలకు ద్వారాలు తెరిచినట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నాన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కబ్జా భూములు వెంటనే తమ ఆధీనంలోకి తీసుకోవడం అధికారుల పని కాగా విధి ధర్మాన్ని పక్కనపెట్టి అధికారులు భూఅక్రమాలపై చోద్యం చూస్తున్నారు. దీంతో బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. రక్షణ లేని భూములను భూ కబ్జాదారులు తమ వశం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బెల్లంపల్లిలో ఖాళీ భూములే కరువయ్యాయి. ప్రజా అవసరాలకు బెల్లంపల్లిలో భూమి లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం సోయిలోకి వచ్చి భూకబ్జాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అక్రమిత భూములను సైతం స్వాధీనం చేసుకోవాలన్న డిమాండ్ కూడా ప్రధానంగా వినిపిస్తుంది. ఈ విషయంలో అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి. బెల్లంపల్లిలో భూకబ్జాల వ్యవహారంపై బెల్లంపల్లి తహసీల్దార్‌ను వివరణ కోసం సెల్ ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేరు.

## ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు గొప్పవి

**ఆదిలాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని మాజీ మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి జాతర వేడుకల్లో ఆయన పాల్గొని ఆదివాసీ నాయకులతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచార, వ్యవహారాల ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ర రాజు, ఆశన్న, పోతన్న తదితరులున్నారు.

## వేర్వేరు ఘటనల్లో నలుగురిపై కేసు నమోదు

**ఆదిలాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులపై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ మంగళవారం మధ్యాహ్న సమయంలో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. ఆర్డీని కలిసిన సమయంలో ఆకారణంగా జోక్యం చేసుకున్న కార్యాలయ ఉద్యోగి ఇర్ఫాన్ ఆయనపై దుర్భాషలాడి దాడి చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ కలాల్ శ్రీనివాస్, కస్తాల అరుణ్‌తో పాటు మరో వ్యక్తి బెదిరించినట్లుగా పేర్కొన్నారు. తన విధులకు ఆటంక పర్చడంతో పాటు కొంత కాలంగా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

## కొత్తగా నాలుగు ఎత్తిపోతల పథకాలు

**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల నియోజకవర్గంలో ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కొత్తగా నాలుగు ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడెం, శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా దండేపల్లి మండలంలో మూడు, లక్షెట్టిపేట మండలంలో ఒక లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లక్షెట్టిపేట మండలం మోదెల ఎత్తిపోతలకు రూ. 14.74 కోట్లు, దండేపల్లి మండలం గూడెంకు రూ. 27.36 కోట్లు, ద్వారకాకు రూ. 17.26 కోట్లు, గుడిరేవు ఎత్తిపోతల పథకానికి రూ. 15.04 కోట్లు మొత్తంగా రూ. 74.40 కోట్లు విడు దలైనట్లు తెలిపారు. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల కింద సాగవుతున్న భూములతోపాటు మరో ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. 2027లో ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు అందుతుందని, టెండరు ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు చేపడుతామని తెలిపారు.

## బస్సు ప్రమాద కారకులపై కేసు నమోదు

**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**

సిద్దిపేట శివారులో ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్‌తో పాటు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ ప్రమోదావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల డిపో నుంచి ఈ నెల 23న రాత్రి హైదరాబాద్‌కు బయలు దేరిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బుధవారం ఉదయం సిద్దిపేట శివారులో రహదారిపై నిలిపిఉన్న లారీని ఢీ కొట్టింది. సిద్దిపేట సమీపంలో ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ సమీపంలో రహదారిపై ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా నిలిపి ఉన్న లారీని బస్సు డ్రైవర్ మంచాల రాజేశ్ అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టడంతో ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బూసి కృష్ణతోపాటు బస్సు డ్రైవర్ రాజేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా అరెస్టు



**మంచిర్యాల, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
సైబరాబాద్ పోలీసులు అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు చేశారు. గుజరాత్ నుంచి పసి పిల్లలను అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో లక్షల రూపాయలకు విక్రయిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రత్యేక బృందాలు గుజరాత్‌కు చెందిన ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతూ ఈ అక్రమ రవాణా వ్యవహారాన్ని గుర్తించగా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పసి పిల్లలను రక్షించి సురక్షిత కేంద్రాలకు తరలించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ముఠాకు మరిన్ని లింకులు ఉన్నాయనే అనుమానంతో గుజరాత్ పోలీసులతో సమన్వయం చేస్తూ విచారణ చేపట్టారు. చిన్నారుల అక్రమ రవాణాకు సంబంధించి ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే 100 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**చిన్న పిల్లలను మంచిర్యాల జిల్లాలో లక్షల రూపాయలకు విక్రయిస్తున్న ముఠా సభ్యులు..**



## ప్రేమ వేధింపులకు యువతి బలి

**గుడిహత్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
ప్రేమిస్తున్నానని, తనను పెళ్లి చేసుకోవాలని ఓ యువకుడు వేధించడంతో మనోవేదనకు గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొల్హారీ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. కొల్హారీ గ్రామానికి చెందిన దేవా కాంబ్లే వర్షిత (18) ఇంటర్ పూర్తి చేసుకొని ఇంటి వద్ద ఉంటోంది. అదే గ్రామానికి చెందిన కాంబ్లే సచిన్ టైల్స్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గత ఏడాదిగా వీరికి పరిచయం ఉంది. వర్షితను పెళ్లి చేసుకుంటానని సచిన్ ఒత్తిడి చేయగా వర్షిత తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారు. వర్షితకు సంబంధాలు వస్తుండడంతో ఎలా పెళ్లి చేసుకుంటావో చూస్తానంటూ సచిన్ వర్షితను బెదిరింపులకు గురి చేశాడని వర్షిత తండ్రి దేవా కాంబ్లే అబంగ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ బెదిరింపుల వల్ల వర్షిత బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్యహత్య చేసుకుందని తెలిపాడు.కాగా సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌రే తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని యువకుడి మృతి



**జన్నారం, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ధర్మారం గ్రామ సమీపంలో చెట్టును ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. బాదంపల్లి గ్రామానికి చెందిన ధూమల్ల వేణు మంగళవారం రాత్రి బైక్ పై వెళ్తుండగా ధర్మారం గ్రామ సమీపంలో ఉన్న చెట్టుకు ఢీకొనడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని లక్షెట్టిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా.. అప్పటికే మృతి చెందాడని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

**సారంగాపూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మలక్ చించోలిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మలక్ చించోలి గ్రామానికి చెందిన మగ్రి ఆడెల్లు (50) గత కొత్త కాలంగా కంటి చూపు రేచీకటితో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేపించినా నయం కాలేదు. ఈ క్రమంలో గురువారం ఆడెల్లు మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుని కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



## ఉరేసుకుని వృద్ధురాలు బలవన్మరణం



**జన్నారం, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
భర్త లేకుండా జీవించలేక ఓ వృద్ధురాలు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన చందరాజుల వెంకటరాజవ్వ (62) భర్త లచ్చన్న 50 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కొడుకు ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు కొడుకుల్లో ఒకరు కరీంనగర్‌లో నివాసం ఉండగా, మరొక కొడుకు చింతగూడలో ఉంటున్నాడు. పెద్ద కోడలితో వెంకటరాజవ్వ కవ్వాల్‌లోనే ఉంటుంది. భర్త మృతి చెందినప్పటి నుంచి బెంగతో ఉండేది. దీనికి తోడు ఆమెకు అనారోగ్య సమస్యలున్నాయి. మంగళవారం రాత్రి అన్నం తిని తన గదిలో నిద్రపోయింది. కోడలు లచ్చవ్వ కూడా తన గదిలో పడుకుంది. తెల్లారే సరికి ఇంటి ముందర గల కొట్టంలో వెంకటరాజవ్వ దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కోడలు కేకలు వేయగా చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై గొల్లపల్లి అనూష సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. శవపంచనామా చేసి, పోస్టుమార్టం కోసం లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. మృతురాలి రెండో కొడుకు ఇందయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భర్త మృతి చెందాడనే బెంగ, అనారోగ్యం సమస్యలతో ఉరేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

## బస్సును ఢీకొట్టిన బొలెరో వాహనం



**రెబ్బెన, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
రెబ్బెన మండలంలోని దేవులగూడ సమీపంలో జాతీయ రహదారిపై ఆసిఫాబాద్ డిపోనకు చెందిన లహరి బస్సును వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో వాహన డ్రైవర్ కొమరె విజయ్ (బెల్లంపల్లి) ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై వెంకట కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..

**ఒకరి దుర్మరణం.. బస్సు డ్రైవరుపై కేసు**

హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ వైపునకు వస్తున్న లహరి బస్సు డ్రైవర్ ధరావత్ రామారావు నిర్లక్ష్యంగా నడపడంతో బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొందని పేర్కొన్నారు. ఒకరి మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**దహెగాం, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన కాటం శ్రీనివాస్ (40) అప్పుల బాధతో బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ ఉత్తం తెలిపిన వివరాల ప్రకారం.. కాటం శ్రీనివాస్ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ద్విచక్ర వాహనంపై రుణం తీసుకున్నాడు. అదేవిధంగా పలు చోట్ల చిట్టీలు వేసి వాటికి సైతం డబ్బులు కడుతున్నాడు. ఈక్రమంలో బైక్ రుణం చెల్లించడానికి, చిట్టీలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నాడు. పనులు లేకపోవడంతో అప్పులు పెరిగి మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఉత్తం తెలిపారు.





## రోడ్డు ప్రమాదంలో దగ్ధమైన ద్విచక్రవాహనం

**ముథోల్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ మార్గంలో జాతీయ రహదారి 61పై పట్టణ శివారులోని ఎస్ఆర్ఆర్ గార్డెన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర భోకర్ తాలుకా రావణ్‌గాపూర్‌కు చెందిన భగవాన్ ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు నుంచి భోకర్ వెళుతున్నాడు. ఈ క్రమంలో భైంసా సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో భగవాన్ కింద పడిపోవడంతో కాలు విరిగింది. కొంతదూరం లారీ.. ద్విచక్రవాహనాన్ని రోడ్డుపై ఈడ్చుకెళ్లడంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. ఆ మార్గంలో వెళుతున్న వారు గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని భైంసా ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

## లారీ కారు ఢీకొని ఒకరు మృతి



**దిలావర్‌పూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
దిలావర్‌పూర్ మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డోంగుర్గాం గ్రామానికి చెందిన గంగాధర్ అనే వృద్ధుడు మృతి చెందాడు. నిర్మల్ వైపు వెళ్తున్న లారీని, భైంసా వైపు వస్తున్న కారు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కారులో ఎడమ వైపు కూర్చున్న గంగాధర్ అక్కడికక్కడే మరణించాడు. లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

## అడవి పందుల దాడిలో పంట ధ్వంసం

**తాంసి, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రానికి చెందిన రైతు ఆశారెడ్డి చేనులో బుధవారం రెండు ఎకరాలకుపైగా కంది పంటను అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. నష్టపోయిన పంటను అటవీశాఖ అధికారులు ఎచి పరిహారం అందేవిధంగా చూడాలని రైతు కోరుతున్నాడు.

**నారుమడి ధ్వంసం చేసిన పందులు..**
మండల కేంద్రంలోని హైస్కూల్ వాడలో చల్ల మల్లేషకు చెందిన వరి నారుమడిని పందులు ధ్వంసం చేశాయి. పందుల బెడదపై పెంపకం దారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని రైతు వాపోయాడు. ఎకరం నారును తొక్కి నాశనం చేశాయన్నారు.





# ఆత్మీయ పండగ.. క్రిస్మస్



క్రిస్మస్ పండగకోసం  నెల రోజుల ముందు నుంచే చర్చిలు రంగులద్దుకున్నాయి.. అల్లరి చేసే చిన్నారులకు, ఆడుకునే పాపాయిలకు, సందడి చేసే మగువలకు, సంబరాలు చేసుకునే యువతకు క్రిస్మస్ తాతయ్య బోలెడన్ని బహుమతులను అందివ్వనున్నాడు.. క్రైస్తవులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో క్రిస్మస్ అలంకార వస్తువులు వెలుగులు విరజిమ్ముతున్నాయి.. స్టార్‌లు, క్రిబ్‌లు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ మాస్కులతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చర్చిలవద్ద సందడి నెలకొంది.



*జిల్లాలోని చర్చిలన్నీ రంగురంగుల దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి.. ఏసుక్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకుని జరుపుకునే పండగ కాబట్టి ఆయన పుట్టిన సమయంలో జరిగిన సంఘటనల ఆధారంగా కొన్ని అలంకార వస్తువులు తయారు చేస్తుంటారు.. వీటిలో ముఖ్యమైనవి స్టార్, క్రిబ్, క్రిస్మస్ ట్రీ.. వీటిని ఇళ్లల్లో విద్యుత్తు దీపాలతో అలంకరించుకోవడం ఆనవాయితీ.. ప్రతి ఇంట్లో పశువుల పాక ఏర్పాటు చేసి.. అందులో క్రిబ్ పెట్టి బాల ఏసును పడుకోబెట్టి.. ప్రార్థనలు చేస్తారు.. ఇలా క్రిస్మస్ ఆరంభానికి పదిహేను రోజుల ముందు నుంచే ఈ తంతు చేస్తుంటారు.. ఇటలీ, జెరుసలేం.. యూరోపియన్ దేశాల్లో ప్రతి ఇంట్లో డిసెంబర్ నెలంతా ఇలాంటి అలంకరణలు చేసి ప్రార్థనలు చేస్తారు. ఈ సంప్రదాయం మన దగ్గర కూడా ప్రారంభమయింది..*

## ఇళ్లపైన స్టార్ :

ఏసు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక తార మెరిసిందని క్రైస్తవ గ్రంథాలు చెబుతున్నాయి.. కాబట్టి క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఇళ్లపై స్టార్‌ను ఏర్పాటు చేస్తుంటారు.. ఇందులో విద్యుత్తె బల్బును ఉంచడం వల్ల రాత్రి వేళలో కాంతివంతంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంది.. ఇలాంటి స్టార్ల ధర ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం కాగితపు స్టార్లను వాడుతున్నారు..





## బహుమతుల బాక్సులు :

ఆర్థికంగా ఉన్న వారు ఇళ్లల్లో క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి.. దానికి బహుమతుల బాక్సులను కడుతుంటారు.. ఇంటికి పిలిచిన అతిథులకు ట్రీకి ఉన్న బాక్సులను తెరిచి.. అందులోని బహుమతులను అందజేస్తుంటారు.. ఈ సంప్రదాయం ఇటీవల కాలంలో ఎక్కువైంది..

## శాంతాక్లాజ్ మాస్కులు :



ఈ పండగ వచ్చిందంటే చాలు క్రిస్మస్ తాతయ్య వచ్చి బహుమతులను ఇస్తారని పిల్లలు అనుకుంటారు.. చాలా మంది శాంతాక్లాజ్ మాస్కులు, దుస్తులు ధరించి బహుమతులను పంచిపెడతారు.. ఇలాంటి వారి కోసం రెడీమేడ్ దుస్తులు, మాస్కులు మార్కెట్లో లభిస్తున్నాయి.. గతంలో తాతయ్య వేషం వేసుకోవడానికి నానా తంటాలు పడేవారని, ఇప్పుడు మాస్కులు ధరిస్తే సరిపోతోందని పలువురు క్రిస్టియన్లు చెబుతున్నారు..

## గంటల బొమ్మలు :

ఏసు జన్మించినప్పుడు ఆకాశం నుంచి గంట శబ్ధాలు వినిపించాయని క్రైస్తవులు చెబుతుంటారు.. కాబట్టే ఇళ్లను అలంకరించుకోవడంలో గంటల బొమ్మలను తప్పని సరిగా వినియోగిస్తున్నారు.. గంటలను గుమ్మాలకు కడుతుంటారు.. క్రిబ్‌ను ఏర్పాటు చేసి దానికి కూడా వేలాడదీస్తారు..



# నీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- కడెం ప్రాజెక్టు కాలువల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- అధికారులతో పలు సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష



ఉట్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)
ఖానాపూర్ నియోజకవర్గంలో నీటి పారుదల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల దృష్టి కి తీసుకెళ్లి సమస్యలను పరిష్కారం తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ నియోజకవర్గ నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ మరమ్మత్తులపై, అడవి ప్రాంతాల ద్వారా ప్రవహించే కాల్వల మరమ్మతులకు అటవీ శాఖ అధికారుల అనుమతుల ఇబ్బందులను ఎమ్మెల్యేకు సూచించారు. కడెం ప్రాజెక్టుకు మహార్దశతో పాటు అలాగే ఇతర సమస్యలపై ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్తానన్నారు. సదర్ మాట్, కడెం ప్రాజెక్టు నుండి చివరి ఆయకట్టు వరకు నీరు అందించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం సిరికొండ మండలంలోని నూతన సర్పంచ్ లు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే ను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

**సరస్వతి కెనాల్‌కు నీటి విడుదల...**
శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు సరస్వతి కెనాల్ ద్వారా నిర్మల్ జిల్లాలోని ఆయకట్టు రైతులకు బుధవారం నీటిని నేటిపారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ప్రతిరోజు 300 క్యూసెక్కుల నీటిని సరస్వతి కెనాల్ ఆయకట్టు రైతులకు అందించడం జరుగుతుందని వారబంది రూపంలో నీటిని విడుదల చేయడం జరుగుతుందని ఏఈ మాధురి వెల్లడించారు.



# ఇండ్ల నిర్మాణాలు అడ్డుకుంటే స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తాం



కొలం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోనేరావు హెచ్చరిక
ఐటీడీఏ ఎదుట నిరసన
29న ఐటీడీఏ ముందు ధర్నాకు పిలుపు

ఉట్నూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)
ఉమ్మడి జిల్లాలోని కోలాం గిరిజనుల ఇండ్ల నిర్మాణాలను అడ్డంకుంటే స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తామని కోలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోనేరావు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటిడిఏ కార్యాలయానికి చేరుకొని ప్రాజెక్ట్ అధికారిని కలవడానికి వచ్చామని ఆయన అందుబాటులో లేకపోవడంతో నిరసన తెలుపుతున్నామన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం తో పాటు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కవ్వాల్ టైగర్ జోన్ పేరుతో అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. గతంలో మహాధర్నా నిర్వహించగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌తోపాటు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఇండ్ల నిర్మాణాలకు అడ్డంకులు లేకుండా ప్రభుత్వాలకు నివేదికలు పంపిస్తామని హామీ ఇచ్చినప్పటికీ గిరిజన ప్రాంతాలలో మంజూరైన గిరిజనుల ఇండ్లు నిర్మించకుండా అటవీశాఖ అడ్డుకుంటుందన్నారు. ఇండ్లు మంజూరు కావడంతో పాత ఇండ్లను తొలగించి కొత్త ఇండ్లు నిర్మించుకుందామని భావిస్తుంటే అటవీశాఖ అడ్డంకులు చెప్పడంతో పిల్లాపాపలతో చలికాలం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రభుత్వంలోని తొమ్మిది శాఖలకు నిధులు మంజూరు చేస్తుండగా పివిటిజి గిరిజనుల అభివృద్ధి సంక్షేమం ఏమాత్రం జరగడం లేదన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళు అవుతున్న పివిటిజి గిరిజనులకు కూడు, గూడు,గుడ్డ అందుబాటులో రాలేదన్నారు. గిరిజనులకు విద్య,వైద్యం, సాగునీటిపారుదల, వ్యవసాయ భూములు ఇంకా అందుబాటులో రాలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న పివిటిజి గిరిజనుల అభివృద్ధి సంక్షేమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా అటవీశాఖ అధికారులను కలిసిన తమకు న్యాయం జరగడం లేదన్నారు. 29న ఐటిడిఏ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల బహిష్కరణకు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. 29న నిర్వహించనున్న ధర్నాకు భారీ సంఖ్యలో కొలాం గిరిజనులు హాజరుకావాలని సోనే రావు కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, భీమ్రావు, ముకుందరావు, చిన్ను, మారుతి, ఆనంద్ రావు, మారు, మాణిక్ రావు, సోనీ రావు, ఆత్రం తుకారం, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై కేసీఆర్
# అనుచిత వ్యాఖ్యలు సహించం

### టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గుల్లపల్లి ఆనంద్



ఆదిలాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై కెసిఆర్ చేసిన అనుచిత వ్యాఖలు సహించరానివని టిడిపి ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ సిర్పూర్ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గుల్లపల్లి ఆనంద్ అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం లేఖ ఇచ్చిన తెలుగుదేశం పార్టీని,జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుపై అబద్ధపు ప్రచారాలు చేసి, చేసి కేసీఆర్ అప్పట్లో అధికారంలోకి వచ్చారన్నారు. 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారాన్ని అనుభవించిన తర్వాత, అధికారాన్ని కోల్పోయి ఇప్పుడు మళ్ళీ అధికారం కోసం సెంటిమెంటును రాజెయాలని కెసిఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించంచారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో అవినీతి జరిగిందని రూ. కోట్లు చేతులు మారాయని కేసిఆర్ కూతురు కవిత దుమ్మెత్తి పోస్తుంటే వాటికి సమాధానం చెప్పకుండా చంద్రబాబు నాయుడుపై ఆరోపణలు చేయడం కెసిఆర్ దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. కేసీఆర్ ప్రెస్ మీట్‌లో నిజాలు చెప్పకనే చెప్పారన్నారు. జూరాల ప్రాజెక్టును తెలుగుదేశం పార్టీ హయాంలోనే నిర్మించడం జరిగిందని కేసీఆర్ ఒప్పుకున్నారని గుర్తు చేసారు. అధికారాన్ని కోల్పోయాక రెండు సంవత్సరాలు ఫామ్ హౌస్‌లో పడుకొన్న కేసీఆర్ భావోద్వేగాలని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పేరు ప్రస్తావించే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. కేసీఆర్ దిగజారుడు వ్యాఖలు చేస్తే సహించబోమని ఆనంద్ హెచ్చరించారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌ను
# సన్మానించిన ఖానాపూర్ ఎమ్మెల్యే

జన్నారం, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)
జల్ సంచయ్ జల్ భాగిదారి అవార్డు అందుకున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం మంచిర్యాల కలెక్టర్ క్యాంపు ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జన్నారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు అదనపు నిధులు కేటాయించాలని, అటవీ సమీప గ్రామాల్లోని ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, పశువుల మేత సమస్య, సీసీ రోడ్లకు, డ్రైనేజీలకు నిధులు మంజూరు చేయాలని, జన్నారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ కోసం ప్రతిపాదనలు పంపించాలని, ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేలాగా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట జన్నారం మాజీ జెడ్పిటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఉన్నారు.



# గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకం

ఖానాపూర్, డిసెంబర్ 24 (ప్రభాత సమాచారం)
ఏ గ్రామామైన అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ పరంగా మంజూరైన నిధులు పథకాలను ప్రజలకు అందించి గ్రామాభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు వేడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం దస్తురాబాద్ గ్రామ సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టిన గోపాల్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని త్వరలో అన్ని గ్రామాలకు నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తే మంచి గుర్తిం పు వస్తుందని, గ్రామాల్లో అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు.